



RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక






సంపుటి : 2 సంచిక : 232 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 20 జూలై 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 232 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 20 July 2025 PAGES : 8 PRICE : 3/-


## ప్రభుత్వ పాఠశాలల ముందు 'ప్రవేశాలు లేవు' బోర్డులు రావాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 19)

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం ద్వారా ప్రవేశాలు పెంచడమే తమ లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కృష్ణా జిల్లా పెనమలూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అద్భుత ఫలితాలు సాధించిన ప్రధానోపాధ్యాయురాలు యలమంచిలి దుర్గాభవానిని 'షైనింగ్ టీచర్' పేరుతో ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మా లక్ష్యం ఒక్కటే! వచ్చే నాలుగేళ్లల్లో ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గాలి. ప్రభుత్వ బడుల్లో పెరగాలి. ప్రభుత్వ పాఠశాలల ముందు 'ప్రవేశాలు లేవు' అనే బోర్డులు ఉండాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య అందిస్తారని తల్లిదండ్రులు నమ్ముతారు. మనం నిజంగా విజయం సాధించిన వారమవుతాం. ఇందుకోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు ఉపాధ్యాయులను నేరుగా కలవాలని నిర్ణయం తీసుకున్నాం. వచ్చే నాలుగేళ్లు విద్యార్థుల అభ్యసనఫలితాలపై దృష్టిసారిస్తాం" అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రధాన ఉపాధ్యాయురాలు దుర్గాభవాని నుంచి మంత్రి ఈ సందర్భంగా సలహాలు, సూచనలు తీసుకున్నారు. అద్భుత పనితీరుతో ఉపాధ్యాయులందరికీ ఆదర్శంగా నిలిచారని ఆమెను ప్రశంసించారు.

**54 మందికి 500కు పైగా మార్కులు**

పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా ఐదేళ్లు పని చేసిన దుర్గాభవాని వృత్తి పట్ల నిబద్ధత చూపి విద్యార్థులను సమున్నతంగా తీర్చిదిద్దారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 54 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. ఏడుగురు విద్యార్థులు -మిగతా 2లో

## దౌత్య విభేదాల తర్వాత.. తొలిసారి మాల్దీవులకు ప్రధాని మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 19)

ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే వారంలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. జులై 23 నుంచి 26 వరకు యూకే , మాల్దీవుల్లో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. గతేడాది మోదీపై, లక్షద్వీప్‌పై మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. విభేదాల అనంతరం ప్రధాని -మిగతా 2లో

## 42 దేశాలు తిరిగొచ్చారు కానీ, ఇంతవరకు మణిపూర్ కు వెళ్లలేదు

**ప్రధాని మోదీపై ఖర్గే ఫైర్**

**మణిపూర్ లో కొంతకాలంగా హింస**

**గిరిజన సమస్యలు, రాజకీయ అస్థిరత**

**సొంత దేశంలో సమస్యలు పరిష్కరించాలని మోదీకి ఖర్గే హితవు**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 19)

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 42 దేశాలను సందర్శించిన ప్రధాని మోదీ, అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మణిపూర్ రాష్ట్రాన్ని మాత్రం ఇప్పటివరకు సందర్శించలేకపోయారని ఎద్దేవా చేశారు. -మిగతా 2లో

# నేరచరిత్ర ఉన్న నేతలను ఊడ్చేయాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 19)

రాష్ట్రాభివృద్ధికి ఒక్కో నెల ఒక్కో కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం బాగుండాలంటే అందరూ స్వచ్ఛత పాటించాలని సీఎం పిలుపునిచ్చారు. ఏపీ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలంటే స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మార్చాలని అన్నారు. జాతీయ స్థాయిలో ఏపీకి 5 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తిరుపతిలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. తాను తిరుపతిలో చదువుకుంటూనే ఎమ్మెల్యేగా ఎదిగానని, అంచెలంచెలుగా ఎదిగి నాలుగోసారి సీఎం అయ్యానని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

"అమరావతిలో క్యాంటమ్ వ్యాలీని నిర్మించి.. ఏఐని అభివృద్ధి చేస్తాం. క్యాంటమ్ వ్యాలీకి చిరునామాగా అమరావతి మారుతుంది. ప్రఖ్యాత విద్యా సంస్థలు తిరుపతిలో ఏర్పాటు చేశాం. విద్యుత్ ఉత్పత్తి కోసం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ తీసుకురాబోతున్నాం. -మిగతా 2లో

## గోదావరి మిగులు జలాలపై జగన్‌కు అవగాహన లేదు

**45.72 మీటర్ల ఎత్తులోనే పోలవరం నిర్మాణం**

**జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**

మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు. చిత్రంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 19)

'గోదావరి నుంచి సముద్రంలో కలిసే వరద నీటిలో 200 టీఎంసీలు తరలించాలనే ఆలోచనతోనే సీఎం చంద్రబాబు పోలవరం- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును ప్రతిపాదించారు. జగన్‌కు అవగాహన లేకుండా పొరుగు రాష్ట్రానికి మేలు జరిగేలా గోదావరిలో మిగులు జలాలు లేవని మాట్లాడుతున్నారు. ఈ ప్రాజెక్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రైవేటు వ్యక్తులను కూడా భాగస్వాములను చేస్తాం' అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. -మిగతా 2లో

## ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించిన చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 19)

ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతిలో పర్యటించారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా.. రేణిగుంట మండలం తూకివాకం వద్ద ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను చంద్రబాబు పరిశీలించారు. ట్రీట్ చేసిన నీటిని ఎలా సద్వినియోగం చేస్తున్నారని అధికారులను అడిగారు. రీసైకిలింగ్ కోసం వచ్చిన ఘన వ్యర్థాలను వినియోగించుకున్న తర్వాత వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు తరలించాలని సూచించారు. తిరుపతి సహా 40 నుంచి 50 కిలోమీటర్ల పరిధిలో సేకరించిన వ్యర్థాలను వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు సద్వినియోగం చేసుకునేలా చూడాలని స్పష్టం చేశారు. విశాఖ సహా పరిసర ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో వ్యర్థాలను సద్వినియోగం చేసేలా చూడాలని పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణలో దేశానికి రోల్ మోడల్‌గా ఏపీ నిలిచేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

## 'పాక్' బుద్ధి వంకరే.. హైజాకర్లను రక్షించేందుకు ఏకంగా చట్టసవరణ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 19)

ఉగ్రమూకలను పెంచి పోషిస్తోన్న పాకిస్థాన్ ఇప్పుడు మరో దుస్సాహసానికి ఒడిగట్టింది. ఉగ్రవాదులకు, హైజాకర్లకు ఆశ్రయం కల్పించిన వారికి మరణశిక్షను రద్దు చేసింది. ఈ మేరకు ఏకంగా చట్టంలో సవరణలు చేసింది. దీనికి సంబంధించిన బిల్లుకు పాక్ సెనెట్ తాజాగా ఆమోదముద్ర వేయడం గమనార్హం. పాక్ పీనల్ కోడ్ చట్టాల ప్రకారం.. హైజాకింగ్‌కు పాల్పడిన వ్యక్తికి ఉద్దేశపూర్వకంగా ఆశ్రయం కల్పిస్తే గరిష్ఠంగా మరణశిక్ష ఎదుర్కొంటారు. ఇక, బహిరంగంగా మహిళపై బలప్రయోగం చేసి ఆమెను వివస్త్రను చేస్తే గతంలో ఏడేళ్ల జైలు శిక్ష ఉండేది. 1983లో జనరల్ జియా ఉల్‌హక్ పాలనలో దాన్ని మరణశిక్షగా మార్చారు. అయితే, ఈతరహా నేరాల్లో శిక్షను తగ్గించాలని పాకిస్థాన్‌లో కొంతకాలంగా డిమాండ్లు మొదలయ్యాయి. ఈక్రమంలోనే తాజాగా క్రిమినల్ చట్ట సవరణ బిల్లు 2025ను తీసుకొచ్చారు. అందులో హైజాకర్లకు ఆశ్రయం కల్పించడం, మహిళలను బహిరంగంగా వివస్త్రను చేయడం వంటి నేరాల్లో దోషులుగా తేలిన వారికి శిక్షలను తగ్గిస్తూ ప్రతిపాదనలు చేశారు. ఇందుకు పాక్ సెనెట్ ఆమోదం తెలిపింది. ఈ నేరాలకు మరణశిక్షలను తొలగించి.. దాని స్థానంలో దోషులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించేలా చట్టంలో మార్పులు చేసింది. అత్యంత తీవ్రమైన నేరాల్లో మాత్రమే -మిగతా 2లో



## ఆంధ్రప్రదేశ్‌లో అపార అవకాశాలు.. లోకేశ్ పోస్ట్‌పై ఆనంద్ మహీంద్రా



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 19)

ఆంధ్రప్రదేశ్‌లో అనేక అవకాశాలు ఉన్నాయని ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా అన్నారు. రాష్ట్రంలో సోలార్ ఎనర్జీ, మైక్రో ఇరిగేషన్, టూరిజం విభాగాల్లో పెట్టుబడులు పెట్టే అంశంపై తమ బృందాలు ఆంధ్రప్రదేశ్‌తో చర్చలు జరుపుతున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో శనివారం పోస్ట్ పెట్టారు. మంత్రి నారా లోకేశ్ పెట్టిన పోస్ట్‌కు బదులిస్తూ.. ఆంధ్రప్రదేశ్ ప్రయాణంలో భాగస్వామ్యం అవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మహీంద్రా నుంచి ఫ్యూరియో ట్రక్ తెలుగు అడ్వర్టైజ్‌మెంట్‌ను తన ఎక్స్ వేదికగా ఆనంద్ మహీంద్రా శుక్రవారం పోస్ట్ చేశారు. "ఒక్క నిర్ణయం చాలు.. మీ విధి మీ చేతుల్లో ఉంది. ట్రక్‌ను సొంతం చేసుకోండి.. జీవితం మార్చుకోండి" అంటూ తెలుగులో ఆ వీడియోకు క్యాప్షన్ పెట్టారు. ఆ వీడియోను చూసిన మంత్రి నారా లోకేశ్.. ప్రకటన హృదయాన్ని హత్తుకునేలా ఉందంటూ ప్రశంసించారు. మహీంద్రా వాహనాలకు అతిపెద్ద మార్కెట్ అయిన ఆంధప్రదేశ్ ప్రజలకు కూడా ఇది నచ్చుతుందని పేర్కొన్నారు. పెట్టుబడులకు అన్ని అవకాశాలున్న ఏపీలో మహీంద్రా తయారీ కేంద్రాన్ని నెలకొల్పే అంశాన్ని పరిశీలించాలని ఈ సందర్భంగా కోరారు. దీనికి ఆనంద్ మహీంద్రా ఈ విధంగా బదులిచ్చారు. 'మన ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది. ముమ్ముందు ఏమవుతుందో చూద్దాం' అంటూ తెలుగులోనే పోస్ట్ పెట్టడం విశేషం.



## జగన్ పూర్తి అజ్ఞానంతో మాట్లాడుతున్నారు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 19)

మీడియా సమావేశాల్లో మాజీ సీఎం జగన్ మాటలు హేతుబద్ధంగా లేవని భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. వడ్డీతో సహా చెల్లిస్తామంటూ పోలీసులు, ప్రభుత్వ అధికారులను బెదిరించడం ఏమాత్రం సరైంది కాదన్నారు. మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామన్న విషయాన్ని మర్చిపోయి.. జగన్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సోము వీర్రాజు మాట్లాడారు. "జగన్ పూర్తి అజ్ఞానంతో మాట్లాడుతున్నారు. ఆయన మాటలు నమ్మిన పీఎస్ఆర్ ఆంజనేయులు పరిస్థితి ఏమైంది? నారా లోకేశ్‌ను పాదయాత్రలో ఎంతో ఇబ్బంది పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పారిశ్రామిక రంగం, ప్రాజెక్టుల నిర్మాణాలు ఎంతో పురోగతి సాధించాయి" అని సోము వీర్రాజు అన్నారు.

## 2027 నాటికి మూడో అతి పెద్ద ఆర్థికశక్తిగా భారత్: అమిత్ షా

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 19)

ఎన్డీఏ పాలనలో భారత్ ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతూ.. వేగంగా ముందుకు వెళ్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. 2027 నాటికి దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్‌లోని రుద్రపుర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. 2014లో భాజపా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దేశంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. పదేళ్లలో దేశాభివృద్ధిలో 60శాతం పెరుగుదల చోటుచేసుకుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 45వేల కిలో మీటర్ల రైల్వే లైన్లు, రోడ్లు -మిగతా 2లో



## వైసీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కెవి రమణారెడ్డికి అదనపు బాధ్యతలు







(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 19)
వైఎస్సార్సీపీ రాష్ట్ర పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశానుగుణంగా ఇప్పటికే పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ,సోషల్ మీడియా స్పెషల్ టాస్క్ ఫోర్స్ రాష్ట్ర సభ్యునిగా కొనసాగుగుచున్న కేవీ రమణారెడ్డికి వాటితో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) ప్రకాశం జిల్లా అదనపు బాధ్యత లను అప్ప గించారు. అదే విధంగా నూతనంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా ( పార్లమెంట్) ప్రకాశం జిల్లాకి గిద్దలూరు నుంచి వై.వెంకటేశ్వరరావు, కొండపికి చెందిన బోట్ల రామారావు లను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియామకానికి కారకులైన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి,రాజ్య సభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డికి పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామక్రిష్ణ రెడ్డికి,రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావుకి, జిల్లా పరిశీలకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి,జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌కి, జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో నెక్లెస్ మేళ




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)
నెక్లెస్ ఫెస్టివల్ మలబార్ గోల్డ్, డైమండ్స్, ఒంగోలు 19 జులై నుండి 26 జులై వరకు, 2025 మలబార్ గోల్డ్, డైమండ్స్ ఒంగోలు షోరూంలో నెక్లెస్ మేళ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో భాగంగా ప్రత్యేకమైన నెక్లెస్‌లను




ప్రదర్శిస్తున్నారు. ఈ ఆభరణాల అద్వితీయమైన కళానైపుణ్యతతో అంతులేని హుందాతనంతో కూడినవి నగిషీ చెక్కి తయారు చేసిన వారి అనుభవం ఇంకా కళాత్మకతకి నిదర్శనంగా నిలుస్తోంది. మలబార్ గోల్, డైమండ్స్ ఒంగోలు షోరూంలో నెక్లెస్ మేళ 19జులై నుండి 26 జులై 2025, వరకు జరుగుతుంది. ఈ ప్రదర్శనలో ప్రత్యేక్ష ఆకర్షణలుగా 22 క్యారెట్ల పాత బంగారు నగల మార్పిడి పై 0% తగ్గింపు. ఈ పరిమిత కాలపు ఆభరణాల ప్రదర్శనలో అద్భుతమైన బంగారు రత్నాలు, వజ్రాలతో కూడిన నెక్లెస్ ఆభరణాల విస్తృత శ్రేణిలో లభిస్తాయి. ఈ " నెక్లెస్ ఫెస్టివల్ " సందర్భంగా ప్రతి కొనుగోలు పై ప్రత్యేక ఆఫర్లను పొందండి. బంగారు ఆభరణాల, రత్నాభరణాలు తరుగు చార్జీల పై ఫ్లాట్ 30% తగ్గింపు, వజ్రాభరణాల వజ్రాల విలువ పై 30% వరకు తగ్గింపు పొందండని తెలిపారు.

## ఎన్‌సీసీకి ఎంపికైన 64 మంది బిఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 19)
కందుకూరు బీఆర్ఆక్స్‌ఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్ ,34(ఏ)బీఎన్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో శనివారం కేర్‌టేకర్ ఎన్‌సీసీ డివిజన్ లో సెలెక్షన్స్ నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో ఆర్మీ ఆఫీసర్లు సుబేదార్ ఇంద్రజిత్ సింగ్, హవల్దర్ సుధీర్ కుమార్, కేర్‌టేకర్ లక్ష్మీ నరసింహారావు లు పాల్గొని 64 మంది విద్యార్థులను సెలెక్ట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను బి ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి బాల భాస్కరరావు, బి నరేంద్ర బాబు లు ప్రత్యేకంగా అభినందించారు.

### మొదటిపేజీ తరువాయి

## నేరచరిత్ర ఉన్న నేతలను ఊడ్చేయాలి

కాలుష్యం లేకుండా గ్రీన్ హైడ్రోజన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చు. వాతావరణ సమాచారం ముందుగా తెలిసేలా యాప్ తీసుకొస్తున్నాం. ఆగస్టు 15 నాటికి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 700 ప్రభుత్వ సర్వీసులు అందిస్తాం.నేర చరిత్ర కలిగిన నేతలు రాజకీయాల్లోకి వచ్చారు. ఇంట్లో చెత్తను ఊడ్చినట్లు.. నేరచరిత్ర ఉన్న నేతలను ఊడ్చేయాలి. గత పాలకులు ప్రజల ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయలేదు. ప్రజల భూములను లాక్కొనేందుకు యత్నించారు. మేం వచ్చాక ఫ్యాక్షనిజం, ముఠా కలహాలు, మతకలహాలు నివారించాం. నేరస్థుల గుండెల్లో నిద్ర పోతాం. వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజే నాపై అసత్య ప్రచారం చేశారు. వైకాపా పాలనలో ఎవరికైనా స్వేచ్ఛ ఉండేనా..?" అని చంద్రబాబు ప్రశ్నించారు.

## ప్రభుత్వ పాఠశాలల ముందు 'ప్రవేశాలు లేవు' బోర్డులు రావాలి

ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాలు పొందారు. రాష్ట్రంలో మొదటిసారి ప్రభుత్వ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఈవెంట్ నిర్వహించారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ ద్వారా వాల్ ఆర్ట్స్, డ్యాన్స్, మ్యూజిక్ తరగతులు, కంప్యూటర్ శిక్షణ అందించారు. ఈ పాఠశాల వినూత్న ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచింది. అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు వారే వినూత్న పరిష్కారాలు కనుగొంటున్నారు. తడిచిన ధాన్యం ఆరబోసే యంత్రంతోపాటు పాఠశాలలో చెత్తను శుభ్రం చేసేందుకు పాత వస్తువుల నుంచి బ్లోయర్ తయారీ, ఆల్కహాల్ సెన్సింగ్ హెల్మెట్ వంటివి ఇక్కడి విద్యార్థులు రూపొందించారు.

## దౌత్య విభేదాల తర్వాత.. తొలిసారి మాల్దీవులకు ప్రధాని మోదీ

ఆ దేశానికి వెళ్లడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాల్దీవులతో బలమైన దౌత్య సంబంధాలు, పరస్పర ప్రయోజనాలు పునరుద్ధరించడానికి ఈ పర్యటన సహకరిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తంచేశారు.

జులై 23-24 తేదీలలో మొదట యూకేలో జరగనున్న భారత్-బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై జరిగే చర్చల్లో మోదీ పాల్గొని..ఒప్పందంపై సంతకం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. యూకే ప్రభుత్వంతో దౌత్య, వాణిజ్య చర్చలు జరపనున్నారు. అనంతరం జులై 25-26 తేదీలలో ప్రధాని మాల్దీవులకు వెళ్లనున్నారు. మాల్దీవుల 60వ జాతీయ దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరవుతారు. గతేడాది జనవరిలో లక్షద్వీప్‌ను సందర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ.. సాహసాలు చేయాలనుకున్నవారు ఇక్కడికి రావాలని పిలుపునిచ్చారు. దీనిపై మాల్దీవుల మంత్రులు అక్కసు వెళ్లగక్కారు. ఇది ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలను దెబ్బతీసే స్థాయికి చేరింది. అనేకమంది భారతీయులు.. ఆ దేశ టూర్ ప్లాన్‌ను విరమించుకున్నారు. సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బాయ్‌కాట్ మాల్దీవ్స్ పేరిట హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అయింది. ఆ వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టిన మాల్దీవులు.. ఆ వ్యాఖ్యలతో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. అనంతరం ఆ మంత్రులపైనా వేటు వేసింది. ఆ తర్వాత నుంచి అధ్యక్షుడు ముయిజ్జు తీసుకున్న భారత వ్యతిరేక నిర్ణయాలు కూడా ఇరుదేశాల మధ్య దూరాన్ని పెంచాయి.

## 42 దేశాలు తిరిగొచ్చారు కానీ, ఇంతవరకు మణిపూర్ కు వెళ్లలేదు

మణిపూర్‌లో గత కొంతకాలంగా హింసాత్మక సంఘటనలు, గిరిజన సమస్యలు, రాజకీయ అస్థిరతలు కొనసాగుతున్నాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం దీనిపై తగిన శ్రద్ధ చూపడం లేదని ఆయన ఆరోపించారు. దేశ ప్రధానమంత్రిగా మోదీ సొంత దేశంలోని సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని, విదేశీ పర్యటనలపై దృష్టి సారించడం సరికాదని ఖర్గే వ్యాఖ్యానించారు.

మణిపూర్ సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం విఫలమైందని, రాష్ట్ర ప్రజల ఆవేదనను అర్థం చేసుకోవడానికి మోదీ స్వయంగా రాష్ట్రాన్ని సందర్శించి, స్థానిక నాయకులతో చర్చించాలని ఆయన సూచించారు. మణిపూర్‌లో శాంతి, స్థిరత్వం తీసుకురావడానికి తక్షణ చర్యలు అవసరమని ఖర్గే పేర్కొన్నారు. అంతేకాకుండా, రాజ్యాంగాన్ని మార్చే ఏ ప్రయత్నమైనా దేశ ప్రజల హక్కులను హరించే చర్యగా పరిగణించబడుతుందని ఖర్గే హెచ్చరించారు. భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని, దానిని బలహీనపరిచే ఏ చర్యనైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని ఖర్గే డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలను కాపాడుతూ, దేశ ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

## గోదావరి మిగులు జలాలపై జగన్‌కు అవగాహన లేదు

పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తుతో 2027 డిసెంబరు కల్లా పూర్తి చేస్తామన్నారు. శుక్రవారం ఆయన విశాఖ జిల్లా భీమిలిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో విలేకర్లతో మాట్లాడారు.'పోలవరం ప్రాజెక్టు ఎత్తుపై జగన్ తరచూ రాజకీయం చేస్తున్నారు. 2025 డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ పూర్తి చేస్తాం. 45.72 మీటర్ల ఎత్తులో నిర్మాణం పూర్తిచేసి 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేస్తాం. ఈ ఏడాది ఎడమ కాలువ ద్వారా నీటిని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం. 2027 డిసెంబరు నాటికి ఉత్తరాంధ్ర, రాయలసీమకు గోదావరి జలాలు తీసుకొస్తాం. వెలిగొండ ప్రాజెక్టును 2026కు పూర్తిచేసి ప్రకాశం జిల్లాకు అండగా నిలుస్తాం. హంద్రీ-నీవా ప్రాజెక్టును జగన్ నిలిపివేస్తే చంద్రబాబు పూర్తిచేసి రాయలసీమకు నీటిని అందించారు. ఉత్తరాంధ్రకు సుజల స్రవంతిని తీసుకొస్తాం. వంశధార-నాగావళి, నాగావళి-చంపావతి నదులను అనుసంధానం చేసి కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. జగన్‌కు తలకాయలు అయినా, మామిడి కాయలైనా ఒక్కటే, తొక్కించుకుంటూ పోతున్నారు. ప్రతిపక్ష హోదాలేని ఆయన రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు' అని మండిపడ్డారు.

## 'పాక్' బుద్ధి వంకరే.. హైజాకర్లను రక్షించేందుకు ఏకంగా చట్టసవరణ

మరణశిక్ష విధించేలా సవరణ బిల్లును రూపొందించింది. త్వరలోనే ఈ బిల్లు చట్టరూపం దాల్చనుంది. అయితే, దీనిపై విపక్షాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనా పాక్ ప్రభుత్వం వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. పాకిస్థాన్ ఉగ్రవాదులకు స్వర్గధామంగా ఉంటోన్న సంగతి తెలిసిందే. ఇటీవల పహల్గాం ఉగ్రదాడితో ఇది మరోసారి బహిర్గతమైంది. భారత్‌లో పలు మారణహోమాలకు కారణమైన లష్కరే తొయ్యిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్ర ముఠాలు పాక్ గడ్డ నుంచే తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. లష్కరే అధినేతను జైల్లో పెట్టామని దాయాది చెబుతున్నప్పటికీ.. అతడికి అక్కడ రాచమర్యాదలు అందుతున్నట్లు నిఘా వర్గాల సమాచారం. ఇక, జైషే చీఫ్ మసూద్ అజార్‌కు స్వయంగా పాక్ ప్రభుత్వమే పటిష్ట భద్రతను కల్పిస్తున్నట్లు ఇటీవల పలు కథనాలు వెలువడ్డాయి. మరోవైపు, ఈ పరిణామాలపై చైనా సానుకూలంగా స్పందించడం గమనార్హం. "ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దాన్ని మేం వ్యతిరేకిస్తాం. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఉగ్రవాదాన్ని నిరోధించేందుకు అమెరికా తీసుకుంటున్న చర్యలు హర్షణీయం. ప్రాంతీయ భద్రత, స్థిరత్వంపై దేశాలు పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలి" అని చైనా పిలుపునిచ్చింది.

## 2027 నాటికి మూడో అతి పెద్ద ఆర్థికశక్తిగా భారత్: అమిత్ షా

నిర్మించామని అమిత్ షా అన్నారు. ప్రధానిగా ఉన్న సమయంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ దేశాన్ని 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చితే.. మోదీ దానిని నాలుగో స్థానానికి తీసుకువచ్చారన్నారు. త్వరలో భారత్‌ను ప్రపంచంలోనే మూడో ఆర్థిక శక్తిగా మార్చేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెడతానని ప్రధాని మోదీ ప్రతిజ్ఞ చేశారని.. దానికోసం తామందరం పని చేస్తున్నామని అన్నారు. దేవభూమిగా పేరుగాంచిన ఉత్తరాఖండ్‌కు రానున్న రోజుల్లో ప్రపంచం నలుమూలల నుంచి అనేక మంది పర్యాటకులు వచ్చేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు.

దేశ ఆర్థిక వృద్ధిని తెలియజేసే ఐఎంఎఫ్ (%ఖఓ%) అంచనాలను ఉటంకిస్తూ..అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్స్‌లో మనకంటే ముందు ఉన్నాయని అమిత్ షా అన్నారు. ఇదే విధంగా మనం ముందుకు సాగితే మరో మూడేళ్లలో జర్మనీని దాటుకొని.. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని పేర్కొన్నారు. ఇందుకోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచంలోని వివిధ కంపెనీలను ఆహ్వానించడం మొదలైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## పీ4 విధానంతో నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయవచ్చు







జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జులై 19)
పి4 విధానం ద్వారా నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయవచ్చని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. శనివారం నందిరాజు తోట గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి 4 పద్ధతిలో నిరుపేద కుటుంబాలకు సహాయం చేయవచ్చు అనే విధానాన్ని ఆయన రూపొందించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. నందిరాజు తోట, హైదరపేట గ్రామాలలో గతంలో 83 మందిని బంగారు కుటుంబాలుగా చేర్చడం జరిగిందని వారిలో సర్వే అనంతరము 16 కుటుంబాలను బంగారు కుటుంబాలను తొలగించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇప్పుడు కొత్తగా 39 మందిని బంగారు కుటుంబాలుగా ఎంపిక చేయడమైనది అన్నారు. ఇప్పటివరకు రెండు గ్రామాలలో 106 మందిని బంగారు కుటుంబాలుగా ఎంపిక చేయడమైనదని వారిలో 12 కుటుంబాలు షెడ్యూలు తెగలకు (ఎస్టి) చెందిన వారిని, 57 కుటుంబాలు షెడ్యూల్ కులాలకు (ఎస్సి) చెందిన వారని, 36 కుటుంబాలు వెనుకబడిన తరగతులు (బిసి) చెందిన వారిని, ఒక కుటుంబం ఇతరులకు (ఓసి) చెందిన వారని ఆయన తెలిపారు.నందిరాజుతోట గ్రామంలో సుమారు 1050 కుటుంబాలు ఉన్నాయని, ఇక్కడ 3 వేలు పైచిలుకు జనాభా నివసిస్తున్నారని ఆయన అన్నారు. ఆదాయ విషయంలో తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలు లెక్కల ప్రకారం 150 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ఇదే గ్రామంలో కొంత ఉన్నత స్థితిలో ఉన్న వారిలో 16 మంది మార్గదర్శకులుగా ముందుకు వచ్చారని తెలిపారు. ఈ మార్గదర్శకులు ఒక్కొక్కరికి రమారమి 10 కుటుంబాల చొప్పున దత్తత తీసుకొని వారికి సహాయం చేయడానికి ఆలోచన చేయాలన్నారు. బంగారు కుటుంబాలకు ఎన్నికైన కుటుంబాల యొక్క స్థితిగతులను, వారి అవసరాలను, ఆదాయాలను గురించి ప్రతి ఒక్కరిని ఆయన అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మార్గదర్శకులుగా ముందుకు వచ్చిన 16 మంది యొక్క స్థితిగతులు, వారు బంగారు కుటుంబాలకు చేసే సహాయం గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థాయి కమిటీ,మండల స్థాయి కమిటీ లో ఎక్కడా కూడా తప్పులు జరగకుండా బంగారు కుటుంబాలను నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. బంగారు కుటుంబాలకు సహాయం చేసే విధానంలో మార్గదర్శకులను బలవంతం చేసే పద్ధతి ఈ కార్యక్రమంలో లేదని ఆయన తెలిపారు. మార్గదర్శకులు డబ్బే కాకుండా మంచి సలహాలు, సూచనలు ఇచ్చి కూడా ఆ బంగారు కుటుంబాలను ప్రోత్సహించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారి జీవితంలో మాట సహాయం ఎంతవరకు ఉపయోగపడిందో వాటిని ఉదాహరణ కింద మార్గదర్శకులకు, బంగారు కుటుంబాలకు వివరించారు. మానవ జీవితంలో ఇతర వ్యక్తుల సహాయం అవసరం ఉంటుందని అన్నారు. మార్గదర్శకులకు బంగారు కుటుంబాలను ఏ విధంగా సహాయం చేయాలో ఆయన తెలిపారు. చేయూత అందించడమే మార్గదర్శకుల యొక్క పని అని, డబ్బు అందించడం అనేది చిట్ట చివరి విషయమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి తలపెట్టిన ఈ కార్యక్రమం విజయవంతమవ ుతుందని పూర్తిగా నమ్ముతున్నానని ఆయన అన్నారు. మార్గదర్శకులు వారికి కేటాయించిన బంగారు కుటుంబాలతో ఒక గ్రూపు ఏర్పాటు చేసుకొని వారి యొక్క అవసరాలను తెలుసుకొని వాటిని తీర్చాలని ఆయన అన్నారు. నీడ్ బేస్డ్ సర్వే సోమవారం నుంచి మొదలు పెట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సచివాలయ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది బంగారు కుటుంబాలకు ఎన్నికైన కుటుంబాలకు వెళ్లి వారి యొక్క అవసరాలను తెలుసుకొని వారి అవసరాలను యాప్ లో నిక్షిప్తం చేయాలని ఆయన తెలిపారు. బంగారు కుటుంబాలలో సర్వే మేరకు మార్పులు, చేర్పులు చేయవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు, సిపిఓ షోలేమ్ రాజు, బీసీ సంక్షేమ అధికారి శివలీల, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి గ్లోరియా, ఎంపీడీవో బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# మోసం వంచనకు మారుపేరు చంద్రబాబు





## వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం

## యర్రగొండపాలెంలో 'బాబు షూరిటీ -మోసం గ్యారెంటీ'

## సభ నిర్వహణ భారీగా తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, జులై 19)

మోసం, వంచనకు మారుపేరు చంద్రబాబునాయుడు అని వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వివరించాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ, రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం ఎర్రగొండపాలెం పట్టణంలో వైష్ణవి ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్. ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు యాదవ్, పార్ల మెంట్ పరిశీలకుడు భక్తుల బ్రహ్మానందరెడ్డి,, పార్టీ ప్రకాశం జిల్లా జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామల, జడ్పీ చైర్మన్ వెంకాయమ్మ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అధ్యక్షత వహించి వీరు ముందుగా స్థానిక వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం అక్కడి నుంచి భారీ ఊరేగింపుతో కళ్యాణమండపానికి చేరుకొని వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన పార్టీ శ్రేణులను ఉద్దేశించి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడారు. ఎన్నికల ముందు అధికారం కోసం చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారన్నారు. ఇప్పుడు ఏడాది గడిచిన వాటిని అమలు చేయలేదన్నారు దీంతో ఆయనను నమ్మి ఓట్లు వేసినా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తొలి నుంచి చంద్రబాబు చెప్పినది ఏది చేయడన్నారు. ప్రజలను మోసం చేయడంలో అతనికి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవ చేశారు. ఈ విషయాన్ని ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. అలాగే ఓటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలని వైఎస్సార్సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



**రాబందుల, పెత్తనందారుల ఆటలు సాగవు**
**గడపగడపకు పోదాం**
**చంద్రబాబు మోసాలను వివరిద్దాం**
**ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్**

గడపగడపకు వెళ్లి చంద్రబాబు మోసాలను వివరిద్దామని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పార్టీ శ్రేణులకు సూచించారు. స్థానిక ఎర్రగొండపాలెం వైష్ణవి ఫంక్షన్ హాల్ లో శనివారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ మండల కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. తొలి అడుగు పేరుతో గ్రామానికి వెళ్తున్న టిడిపి నాయకులను ప్రజలతో కలిసి ఏడాది కాలంగం చేసిన అభివృద్ధి ఏమిటి అంటూ నిలదీయాలన్నారు. సూపర్ పథకాలతో అధికారంలోకి వచ్చిన ఆ తర్వాత విస్మరించిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలన్నారు. క్యూ ఆర్ కోడ్ నో స్కామ్ చేసి తెలుగుదేశం పార్టీ చేసిన మోసాలను జనాలకు చూపించాలన్నారు. (తరువాయి 4లో...)

# ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణే లక్ష్యం

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 19)

ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను నిర్వహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పిలుపునిచ్చారు. 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి శనివారం మార్కాపురంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని, ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించరాదని ప్రజలకు చెప్పారు. ప్రతినెలా మూడో శనివారం ' స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర 'లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలలో ' ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం ' అనే ఇతివృత్తంతో ఈ నెలలో అవగాహన కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వలన ఆరోగ్యానికీ, పర్యావరణానికీ ప్రమాదమని



చెప్పారు. మార్కెట్ కు వచ్చే ప్రజలు సాధ్యమైనంతవరకు బట్టతో, నారతో చేసిన సంచులను వినియోగించాలని (తరువాయి 4లో...)

# కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో కందుల వసంత లక్ష్మి

### 7 మందికి రూ.3,84,686 చెక్కులు అందజేత





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 19)

కార్యకర్తలకు ఎళ్ళవేళలా అండగా నిలిచే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత లక్ష్మి అన్నారు. శనివారం నియోజకవర్గంలోని పొదిలి మండలంలోని 7 మంది రోగుల కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి 7 మందికి సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా మన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి తీసుకువస్తే వీలైనంత వరకు పరిష్కరించడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ అంటే మీ కుటుంబం అని అన్నారు. కుటుంబంలో ఏ ఒక్కరికి ఏ చిన్న కష్టం వచ్చినా ఆ కష్టాన్ని తీర్చేందుకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముందుంటారన్నారు. తొలుత పట్టణం, మండలంలో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్ళి ఆమె స్వయంగా వారికి చెక్కులు పంపిణీ చేసి ఎమ్మెల్యే కందుల మీకు అండగా ఉంటాడని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డుకు చెందిన ముల్లా షబ్బీర్ కు రూ.1,40,329, 3వ వార్డుకు చెందిన రామలోటి మాబు కు రూ.25,000, 6వ వార్డుకు చెందిన షేక్ షేనవాజ్ కు రూ.30,028, 18వ వార్డుకు చెందిన ఉప్పు రంగమ్మకు రూ.47,016 లు, ఓబులక్కపల్లి గ్రామానికి (తరువాయి 4లో...)

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అభివృద్ధి

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 19)

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా మార్కాపురం జి.జి.హెచ్‌ను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చెప్పారు. ఈ ఆసుపత్రిలో అభివృద్ధి చేసిన ఐసీయూ, థైరాయిడ్ పరీక్ష పరికరాన్ని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలోని వైద్యులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక సాధించామన్నారు. ఇందులో భాగంగా మూలన పడిన ఐసీయూని పునః ప్రారంభించామని చెప్పారు. వైద్య సేవల (తరువాయి 4లో...)

# క్లోజ్ ది షాప్..!!

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 19)

శనివారం మార్కాపురం పట్టణంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆకస్మికంగా బస్టాండును తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉన్న మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. బస్టాండ్ నుంచి ఎన్ని సర్వీసులు నడుపుతున్నారో అధికారులను అడిగి ఆరా తీశారు. ఈ క్రమంలో బస్టాండులోని ఒక షాపులో స్థానికంగా తయారైన తాగునీటి బాటిళ్లను అధిక రేటుకు విక్రయిస్తుండడాన్ని గుర్తించారు. ఎలాంటి ఎంఆర్‌పీ లేకుండా ఇష్టానుసారంగా విక్రయిస్తున్న స్థానికంగా తయారైన తినుబండారాల ప్యాకెట్లను కూడా ఆమె గమనించారు. షాపులో ధరల పట్టీ కూడా లేకపోవడం పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తాను ఈ షాపును తనిఖీ చేసి లోపాలను సరి చేసుకోవాలని నోటీసు ఇచ్చినట్లు స్థానిక తహసిల్దార్ చిరంజీవి ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీని పై ఆమె స్పందిస్తూ షాపును క్లోజ్ చేయించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ధరల పట్టీ లేకపోయినా, నాణ్యత ప్రమాణాలు పాటించకపోయినా, కాంట్రాక్టు, నుమతి లేకుండా షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకోవాలని వారికి దిశా (తరువాయి 5లో...)



# మోసం వంచనకు మారుపేరు చంద్రబాబు



నెరజాయాలని జిల్లా అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం ఎర్రగొండపాలెం వైఎస్ఆర్సిపి విస్తృతస్థాయి సమావేశంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ ప్రసంగించారు.

**ఇంటింటికీ తెలియజెప్పాలి**

**నాగార్జున యాదవ్**

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించాలని సూచించారు. వైఎస్ జగన్ పాలనలో జరిగిన మేలు, చంద్రబాబు పాలనలో జరిగిన మోసం గురించి వెల్లడించాలని తెలిపారు. ప్రతి ఇం టికీ వెళ్లి రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ను స్కాన్ చేయించాలని తెలిపారు.

**మహిళలకు మొండిచేయి.. శ్యామల**

రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల మాట్లాడుతూ చం ద్రబాబు తల్లికి వందనం అంటూ అర్హులైన తల్లులకు పథకాలు ఇవ్వకుండా పంగనామాలు పెట్టారన్నారు. దీపం పథకంలో సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్తే ఆ దీపం వెలగకుండానే ఆరిపోయిందని ఎద్దేవా చేశారు. పిఠాపురం పీఠాధిపతి పవన్ తన సొం ఈ జిల్లాలో మహిళకు అన్యాయం జరిగితే మాట్లాడరు. కార్యక్రమంలో ఐదు మండలాల జడ్పిటిసిలు ఎంపీపీలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని ఏ కష్టం వచ్చినా ఈ తాటిపర్తి చంద్రశేఖర్ ఆదుకోవడానికి ముందు ఉంటాడని భరోసా ఇచ్చారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ఎవరు భయపడవద్దన్నారు. రాబందులు ఎన్ని కుట్రలు కుయ్యుత్తులు, చేసిన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రాష్ట్రంలో ఈ కూటమి రాబందులు చేస్తున్న అక్రమాలు మట్టి, మద్యం, బియ్యం వారు చేసే అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడుని జగన్మోహన్ రెడ్డి గద్దె దింపడాన్ని జగన్మోహన్ రెడ్డి పై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయాలని కూటమి రాబందులు అక్రమ కేసులు పెడుతున్న సంగతిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన ఎర్రగొండపాలెం లో వైఎస్ఆర్సిపి తో పాటు 175 నియోజకవర్గాల వైసిపి ఎమ్మెల్యేలు గెలుస్తారని అన్నారు.

**పథకాలపై పాలకులను నిలదీయండి**

**జిల్లా అధ్యక్షులు బూచేపల్లి**

అబద్ధపు హామీలతో పేద ప్రజలను చంద్రబాబు మోసం చేశారని అలాగే పథకాలు అమలు చేయకపోవడంపై అధికారం పక్షాన్ని ప్రజల

# కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ











చెందిన వీరిశెట్టి సుభాషిణి కి రూ.25, 574, మల్లవరం గ్రామానికి చెందిన రెడ్డిబోయిన చిన్న నరసింహం కు రూ.46,649, అక్కచెరువు గ్రామానికి చెందిన పొదిలి నరసమ్మకు రూ.70,090 చెక్కులను ఆమె స్వయంగా అందజేశారు. దీంతో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కష్టం తెలుసుకుని తమకు సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంజూరు చేయించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి చేతులెత్తి మొక్కుతున్నామన్నారు. వారి మేలు ఎన్నటికీ మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, పొదిలి పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, మెడికల్ బోర్డు మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, పొదిలి ఏఎంసి డైరక్టర్ సోమిశెట్టి శ్రీదేవి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), దోర్నాల అంజిరెడ్డి, పొదిలి శివాలయం ప్రతిపాది ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ షేక్ రసూల్ మహమ్మద్, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షులు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఎస్ఎం భాష, ఏలూరి సొసైటీ అధ్యక్షులు ఉలవా గోపి, తానికొండ వెంకట్రావు, ముని శ్రీనివాసులు, మహిళా నేతలు, ఆయా గ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణే లక్ష్యం











ఆయన పిలుపునిచ్చారు. అనివార్యమైతే ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు తయారుచేసిన పునర్వినియోగించే అవకాశం ఉన్న ప్లాస్టిక్ మాత్రమే వాడాలని చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను ఇస్తున్న దుకాణాలపై పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టి, నివారణ చర్యలు తీసుకోవాలని మంత్రి మార్గ నిర్దేశం చేశారు. ఇలా ఎక్కువ రికవరీ చేస్తూ, చురుకుగా వ్యవహరిస్తూ, మెరుగైన పనితీరు చూపిన సిబ్బందికి ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దిన వేడుకల్లో ప్రత్యేక అవార్డు ఇస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ ను కాకుండా ప్రత్యామ్నాయాల వినియోగంపై ప్రజలు దృష్టి సారించాలని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలలో కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించకుండా ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లాలో కలెక్టరేట్ నుంచే దీనిని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ విషయాలపై అవగాహన కల్పించేందుకే మార్కాపురంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగ రహిత మార్కాపురం ఆవిష్కరణకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన చర్యల వలన ప్రజల్లోనూ, వ్యాపారుల్లోనూ కొంత మార్పు వచ్చిందని, దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మార్కెట్లోని దుకాణాలను సందర్శించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను విక్రయించవద్దని షాపుల యజమానులకు వారు సూచించారు. వీటి వలన కలిగే అనర్థాలను వివరించారు. మున్సిపాలిటీలో ఉత్తమ పనితీరు చూపుతున్న ఐదుగురు శానిటేషన్ సిబ్బందిని ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే సన్మానించారు. ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా చేపట్టిన అవగాహన ర్యాలీని కూడా వారు ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గడియారం స్తంభం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. కాలుష్యకారక ప్లాస్టిక్ ను తాము వినియోగించబోమని, పర్యావరణాన్ని కాపాడుకునే విషయంలో తమవంతు బాధ్యత నిర్వహిస్తామని ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారితో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, జడ్పీ సీఈవో చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ నారాయణ, తహసిల్దార్ చిరంజీవి, మార్కాపురం ఏఎంసి ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, నియోజకవర్గ టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి కందుల రామిరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివి కృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వద్దు పేపర్ బ్యాగ్‌లు ముద్దు

## పర్యావరణ పరిరక్షణ పై అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు











**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 19)**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పేపర్, జ్యూట్ బ్యాగులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం కందుకూరు పట్టణం లోని వాసవి కళ్యాణ మండపం వద్ద "స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వాసవి కళ్యాణ మండపం వద్ద నుండి ప్లాస్టిక్ వద్దు, పేపర్ బ్యాగ్‌లు ముద్దు నినాదాలతో ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ ర్యాలీలో మున్సిపల్ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతి నెలలో మూడో శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చినారు... ప్రజలలో ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే నష్టాలు వివరించేందుకు, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, పేపర్ సంచులు, జ్యూట్ బ్యాగులను ప్రోత్సహించాలి. ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని తెలిపారు. ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్థానికులకు స్వయంగా జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ముందుగా అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె అనూష, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, కొత్తూరు వెంకట సుధాకర్, కొత్త నరేంద్ర మురారిశెట్టి వెంకట సుబ్బారావు, కోట నరసింహం, చక్కా కేశవ్, ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, అవినాష్ ఉమామహేశ్వరరావు, శ్రీకాంత్, కాకుమాని ప్రవీణ్, ఇన్నమూరి నరసింహం, పాదర్తి నారాయణ, ముచ్చు శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, కూనం నరేంద్ర, సంగా పాండురంగారావు, అత్తంటి శ్రీహరి నాయుడు, జియావుద్దీన్, తదితర నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 19)**

మండల కేంద్రమైన ఉలవపాడుశాఖా గ్రంథాలయంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రంథాలయంలోని అన్ని విభాగాల నందు బూజు దులిపి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు.



## భూ సమస్యలు పరిష్కరించాలి




**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జులై 19)**

పేదలు ఎదుర్కొంటున్న టువంటి భూ సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమంతునిపాడు మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల మూడవ మహాసభ ఎస్ వెలుకొండయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వీరు మాట్లాడుతూ మండలంలో పేదల సాగు భూముల కొరకు అధికారుల చుట్టూ ఆఫీసులు చుట్టూ తిరుగుతున్నారు. తప్ప భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని భూమిలేని ప్రతి పేద కుటుంబానికి మూడు ఎకరాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు సాగు భూములు స్మశాన వాటికల సమస్యలను భూ సంబంధిత సమస్యలన్నిటికీ పరిష్కారం చూపుటకు అధికార యంత్రాంగం అధికారులు చొరవ చేయాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో ప్రభుత్వ భూములు పెత్తందారుల చేతుల్లో భూస్వాములు చేతుల్లో, బినామీ పేర్లతో కేంద్రీకృతమైనాయని ఈ భూములను వెలికి తీసి పేదలకు పంచాలన్నారు. ఈ పంపిణీ ద్వారా ప్రజా ప్రభుత్వం గా గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. గత ప్రభుత్వ కాలంలో ఇచ్చినటువంటి ఇళ్ల స్థలాల్లో నేడు చిల్లర చెట్లు మనిషి ఆయని నివాసయోగ్యంగాని స్థలాలు పంపిణీ వల్ల ప్రజాప్రయోజనం లేదని గుర్తు చేశారు. మండల కేంద్రంలోని ఇళ్ల స్థలాల సమస్యను కాజీ పురం మిట్టపాలెం పేదల భూ సమస్యను పరిష్కారం చేయడంలో పాలకులు విఫలమైనారని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి లేక కూలీలు నిరంతరం వలస పోతున్నారని ఉపాధి హామీ చట్టం ద్వారా సంవత్సరానికి 200 రోజులు పని కల్పిస్తూ రోజుకూలి 600 రూపాయలు చెల్లించాలని ఆ రకంగా ప్రభుత్వాలు నిర్ణయాలు చేసి వలసలు నివారించాలని కోరారు. గత మే నెల 10వ తేదీ తర్వాత ఉపాధిలో పెండింగ్ బిల్లులు పేరుకుపోయాయని బిల్లులు చెల్లించి కూలీలను సకాలంలో ఆదుకొని తిరిగి ఉపాధి పనులు ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భంగా మండలంలో జరిగినటువంటి స్కూల్ విలీనంలో వివక్షతను ఎండగట్టారు పేదలకు విద్యను దూరం చేయటం కోసం పాలకవర్గంతో చేతులు కలిపి దళితులకు విద్యను దూరం చేసేటువంటి చర్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా 11 మంది తోటి మండల వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగినట్టు తెలిపారు అనంతరం నూతన కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి మహాసభ తీర్మానాలను తాసిల్దార్ కు వినతిపత్రం రూపంలో ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గురునాథం రాములు, జి గురుస్వామి, తంతేల సామేలు, సొరకాయల ఏసేబు, వెంకట్రావు, బాల గురుస్వామి, భాగ్యమ్మ, అశ్విని, సావిత్రి, కుమారి, ప్రకాష్, మల్లెల యోహాన్, తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అభివృద్ధి











అవసరాన్ని గుర్తించి అందుకు తగినట్లుగా డిప్యూటేషన్ పైన వైద్యులను నియమించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రిలోని రెండో ఆపరేషన్ థియేటరుకు వారం రోజుల్లోగా ఇన్వర్టర్ ఏర్పాటు చేసేలా, అదేవిధంగా మొదటి థియేటర్ కు బ్యాకప్ సామర్థ్యం పెంచేలా స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటారని మంత్రి చెప్పారు. ఆక్సిజన్ ప్లాంటు, జనరేటర్లు కూడా మంచిగా పని చేసేలా రిపేర్లు చేయిస్తామన్నారు. విద్యుత్ వైరింగ్ సమస్యల పైనా వైద్యులతో చర్చించామని, దీనిని సరి చేసేందుకు ఇప్పటికే అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపినట్లు వైద్యులు చెప్పారని మంత్రి తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో తాను పరిశీలిస్తానన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ఐసీయూ ద్వారా మంచి సేవలు అందించి ఉత్తమ ఐసీయూ విభాగంగా గుర్తింపు పొందేలా పనిచేయాలని వైద్యులకు ఆయన దిశ నిర్దేశం చేశారు. ఒంగోలు వెళ్లే మార్గంలో పట్టణంలోని చెరువు కట్ట రోడ్డును కూడా మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వారి వెంట సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ నారాయణ, తహసిల్దార్ చిరంజీవి, మార్కాపురం ఏఎంసి ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, నియోజకవర్గ టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి కందుల రామిరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివి కృష్ణారావు, ఇతర అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## క్లోజ్ ది షాప్..!!





నిర్దేశం చేశారు. ప్రయాణికులకు సదుపాయాలు, సేవల విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని కూడా వారికి చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, ఇతర అధికారులు ఉన్నారు.



# శ్రీ సంస్కృతి స్కూల్‌లో ఇన్వెస్టిచర్ వేడుకలు












**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 19)**

కందుకూరు పట్టణంలోని శ్రీ సంస్కృతి స్కూల్ లో పట్టాభిషేక వేడుకలో నూతన విద్యామండలి సభ్యుల ప్రమాణ స్వీకరణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. నాయకత్వ లక్షణాలు శక్తి యుక్తులతో బలమైన 800 మంది యువ విద్యార్థులతో కూడి ముఖ్య అతిథిలుగా సబ్ ఇన్స్పెక్టర్ శివ నాగరాజు, డిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ దిల్ నషీన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యేశించి సబ్ ఇన్స్పెక్టర్ శివ నాగరాజు మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులను తీర్చి దిద్దడంలో యాజమాన్యం కృషిని అభినందించి, కొత్తగా నియమితులైన విద్యార్థి నాయకులను వారి పాత్రలు, బాధ్యతలను సూచిస్తూ బ్యాడ్జ్‌లు, సెషెస్‌లు, జెండాలను అందజేసి, పాఠశాల విలువలను కాపాడతామని, క్రమశిక్షణను, విధులను చిత్త శుద్ధితో నిర్వర్తిస్తామని హెడ్ బాయ్, హెడ్ గర్ల్ మరియు ఇతరులచేత ప్రతిజ్ఞ చేయించారు. డిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ దిల్ నషీన్ ఇన్వెస్టిచర్ కార్యక్రమం విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు జట్టు కృషి కమ్యూనికేషన్, నిర్ణయం తీసుకునే సామర్థ్యం పెంపొందించడానికి సహాయ పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఛైర్మెన్ కొంకా చంద్రశేఖర్ ఇంతటి ప్రతిష్టాత్మక వేడుకను మన సంస్థ ప్రారంభం నుండి నిర్వహిస్తుందని, జ్ఞానం మరియు నాయకత్వ సాధనకు ప్రతీకగా నిలిచేవిధంగా మన సంస్థ వ్యవహరిస్తుందని, అడ్మినిస్ట్రేటివ్ పనితీరు విద్యార్థి మండలి ఆధ్వర్యంలోనే నిర్వహించడం సాంప్రదాయమని సమాజం పట్ల బాధ్యత, సేవ మరియు నిబద్ధత మొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం సురేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ శోభారాణి, కో-ఆర్డినేటర్ శకుంతల, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఏడో రోజుకు చేరిన పారిశుద్ధ్య కార్మికుల సమ్మె




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)**

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె ఏడవ రోజుకు చేరింది పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నాలుగో రోజుకు చేరింది ఒంగోలు మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులు ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయం నుండి కలెక్టరేట్ మీదుగా అర్ధనగ్న ప్రదర్శనగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి అర్జీ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తమ వేతనాన్ని కోల్పోయి గత ఏడు రోజుల నుంచి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టి పట్టినట్లు వివరిస్తుందని, అధికారం రాకముందు గత సమ్మె కాలంలో మున్సిపల్ కార్మికుల సమ్మె పోరాటం చేస్తుంటే రాష్ట్రీయప్తంగా టిడిపి నాయకులు మున్సిపల్ కార్మికుల వద్దకు వచ్చి మీరు చేసే పోరాటం న్యాయమైనది మన ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలు పరిష్కారం చేస్తానని వాగ్దానాలు చేశారు ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటిన మున్సిపల్ నాయకత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు గత ఏడు సంవత్సరాల నుంచి వేతనాలు పెరక్క కుటుంబ పోషణ గడవక రాష్ట్ర ప్రభుత్వానికి అనేక తపాలుగా విన్నవించడం జరిగింది ఈరోజు నగరాల్లో బతకాలంటే ఇంటి అద్దెలు పిల్లల చదువులు నిత్యవసర సరుకులు కొనాలంటే కనీసం 26000 ఉండాలి.. కానీ ఇంజనీరింగ్ కార్మికులకు 15వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారు గత 17 రోజులు సమ్మెలో నాన్ పిహెచ్ వర్కర్ ని పెట్టి ఏడు సంవత్సరాల కాలంలో లక్షల్లో రావలసిన డబ్బులు కోల్పోవడం జరిగింది పారిశుద్ధ్యకార్మికులు. ఆప్కాస్ లో ఎంప్లాయ్ ని కోడు లింకుపెట్టి.. ఏ ఒక్క ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమల కావటం లేదు మనుషులు చేయకూడని పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు.. తమ ఆయుస్సు ప్రాణాలను లెక్కచేయకుండా. పర్యావరణాన్ని. ప్రజారోగ్యాన్ని.. పరిరక్షిస్తున్న మున్సిపల్ కార్మికులకు వెంటనే సంక్షేమ పరకాల అమలు చేయాలని..

ఈ మధ్యకాలంలో అనేకమంది చనిపోవడం రిటైర్డ్ అవ్వడం జరిగింది.. వాళ్లకు సంబంధించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ గాని గత సమ్మె కాలంలో ఒప్పందం చేసుకున్న 75000 రిటైర్మెంట్ బెనిఫిట్స్.. బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు.. మరో కార్మికుడు కోవిడ్ కార్మికుడు కోవిడ్ టైం లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులను పేరుతో వీళ్ళనిధుల్లోకి తీసుకొని గత ఎనిమిది సంవత్సరాల నుంచి వేతనాలు పెంచకుండా.. 12వేల తో ఎలా బతకాలని వాళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఎలాగూ ఒకే పని చేసే కార్మికులు ఇన్ని రకాల వేతన వ్యత్యాసాలను. సవరించి సమాన పనికి సమాన వేతన ఇవ్వాలని ఈ సమస్యల పరిష్కారం కోసం కార్మికుల ఉద్యమం బాట పట్టారు పట్నాలు కంపు కొడుతున్నాయి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుంటే మా సమ్మె పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, కే సామ్రాజ్యం, యు కుమారి, జి నరసింహ, ఆర్ శ్రీనివాసరావు, ఎం బాబు, వై రవి, ఏ అబ్రహం, డి మర్రిబాబు, కే పద్మ, కే శ్రీదేవి, శివమ్మ, కే జానయ్య, కే మోహన్‌రావు, లక్ష్మీ ప్రసన్న, వెంకట్రావు, రూతుమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# విలేకరి పై దాడి

## ఫిర్యాదు చేసి మూడు రోజులైనా పట్టించుకోని పోలీసులు




**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 19)**

సాక్షాత్తు ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమంలో ఒక విలేఖరి పై దాడి జరిగిన ఆ దాడి సంఘటనపై అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో మండలంలోని విలేకరులందరూ ఐక్యంగా కందుకూరు డిఎస్పి బాలసుబ్రమణ్యంకు ఫిర్యాదు చేసిన ఇప్పటికీ మూడు రోజులైనా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తించటం పత్రికా రంగంపై, విలేకరులపై పోలీసులకు ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నించేలా చేస్తుంది. వివరాల్లోకెళ్తే ఈనెల 17వ తేదీన గురువారం సాయంత్రం కరేడు పంచాయతీ పరిధిలోని బట్టిసోమయ్యపాలెం మత్స్యకారు గ్రామంలో సాయంత్రం కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. అయితే విధి నిర్వహణలో భాగంగా ఎప్పటిలాగే ఒక ప్రముఖ దినపత్రిక విలేకరి న్యూస్ కవరేజ్ చేస్తున్నాడు. అదే కార్యక్రమానికి ఎమ్మెల్యే బంధువు అని చెప్పుకుంటూ అనధికారికంగా మండలంలో పెత్తనం సాగిస్తున్న వ్యక్తి అనుచరులుగా గుర్తింపు పొందిన బ్యాచ్‌లో ఒక యువకుడు సదరు విలేకరిపై పాత కక్షల నేపథ్యంలో గొడవను ప్రేరేపించి సదరు విలేకరిపై దాడి చేశాడు. వందల మంది సమక్షంలో ఎమ్మెల్యే కార్యక్రమం జరుగుతుండగా ఆ యువకుడు ప్రవర్తించిన అనుచిత చర్యలకు అక్కడున్న ప్రజలందరూ దాడికి పాల్పడిన వ్యక్తి వెనుకున్న శక్తుల పై మాట్లాడుకోవడం విశేషం. అనధికారికంగా పెత్తనం సాగిస్తున్న అధికార పార్టీ నేత చర్యలను తప్పుపడుతూ విలేకరులకే ఈ ప్రభుత్వంలో రక్షణ లేకపోతే సామాన్యులకి ఇంకెలా ఉంటుందని కార్యక్రమానికి విచ్చేసిన ప్రజల్లో చర్చాశంగా మారింది. అదీ కాక చుట్టూ జనం, పోలీసుల బందోబస్తు అయినా ఆ యువకుడి దుందుడుకు చర్యల వెనుక అధికారి పార్టీ నాయకుడి అండదండలు పుష్కలంగా ఉన్నాయని చర్చ జరుగుతుంది. విలేకరి పై దాడి చేసిన యువకుడి పై గత మే నెలలో ఇంటర్ విద్యార్థిని గాయపరిచిన కేసు నమోదై ఉండటం విశేషం. ఇలాంటి నేర చరిత్ర కలిగిన యువకులను స్థానికంగా కొందరు స్వలాభం కోసం ప్రేరేపిస్తూ వారి రాజకీయ స్వలాభం, అక్రమ వ్యాపారాల దందాల కోసం ప్రోత్సహిస్తు, ఆ యువకులు చేసే అసాంఘిక కార్యక్రమానికి అండ దండలు అందిస్తూ ఒక భయానికర వాతావరణ సృష్టించటం విశేషం. సదరు అధికారి పార్టీ నాయకుడి అండదండలతో రెచ్చిపోయిన యువకుడు విలేకరి పై దాడి చేయడం ఆ దాడిపై నేటికీ తగిన చర్యలు తీసుకోకపోవడం రాజకీయ పెద్దల కనుసన్నల్లో దాడి చేసిన యువకుడికి అండదండలు అందించడంతో పోలీసులు కూడా ఇప్పటికీ ఆ యువకుడిని ప్రశ్నించకపోవడం సామాన్య ప్రజల్లో కూడా పోలీసుల ప్రవర్తనపై చర్చ జరుగుతుంది. సభ్య సమాజంలో ప్రశ్నించే కలం పైనే దాడి జరిగినప్పుడు స్పందించని పోలీసులు, ఇలాంటి అరాచక శక్తుల నుంచి సామాన్య ప్రజలకు ఇంకేమి రక్షణ కల్పిస్తారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

# స్మార్ట్ మీటర్ల పై అపోహలు తొలగించేందుకు అవగాహన

## ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)**

గత కొన్ని వారాలుగా స్మార్ట్ మీటర్ల ద్వారా అధిక బిల్లులు వస్తున్నాయని ప్రజల్లో వదంతులు వ్యాపించాయి. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలకు స్మార్ట్ మీటర్ మీద ఉన్న అపోహలు పోగొట్టడం కోసం ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖ సూపెరింటెండింగ్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మనిషి మారుతున్న కాలంతో పాటు ఎలాగైతే ల్యాండ్ లైన్ ఫోన్ నుంచి సెల్ ఫోన్ కి పరిపూర్ణత చెందుతున్నాడో, విద్యుత్ సంస్థలు కూడా ప్రస్తుతం ఉన్న ఐ.ఆర్.డి.ఏ మీటర్ నుంచి స్మార్ట్ మీటర్‌కి మారుతున్నారు. గతంలో కూడా మెకానికల్ మీటర్ నుంచి ఐ.ఆర్.డి.ఏ మీటర్‌కి మారామన్నారు. స్మార్ట్ మీటర్ల రీడింగ్ల ఖచ్చితత్వాన్ని తనిఖీ చేయడానికి, ఒక కమిటీని నియమించారు. ఈ కమిటీ గుణదల, గన్నవరం, వరలక్ష్మి నగర్, కొత్తపేట, వుయ్యూరు, సుందరమ్మపేట, పులిగడ్డ, ముత్యాలమ్మ సెంటర్ వంటి వివిధ ప్రాంతాలలో స్మార్ట్ మీటర్లతో పాటు అమర్చిన చెక్ మీటర్లను పరిశీలించింది. ఈ తనిఖీలో కొత్తగా అమర్చిన స్మార్ట్ మీటర్లతో పాటు ప్రస్తుతం ఉన్న మీటర్ల రీడింగ్లను పోల్చి విశ్లేషించడం జరిగింది.

**తనిఖీ ఫలితాలు ఇలా ఉన్నాయి...** 99.9% స్మార్ట్ మీటర్లు ప్రస్తుతం ఉన్న మీటర్లతో సమానమైన రీడింగ్లను చూపించాయి. మిగిలిన మీటర్లలో 2% కంటే తక్కువ స్వల్ప వ్యత్యాసం ఉంది. అది కూడా అనుమతించదగిన పరిమితి లోపలే ఉంది. స్మార్ట్ మీటర్లు ప్రస్తుతం ఉన్న మీటర్ల వలె ఖచ్చితత్వంతో పనిచేస్తాయని, వినియోగ రీడింగ్లలో ఎటువంటి వ్యత్యాసం లేదని ఈ తనిఖీ నిరూపిస్తుందన్నారు.

**స్మార్ట్ మీటర్ వల్ల ఉపయోగాలు**

స్మార్ట్ మీటర్లు ప్రస్తుతం ఉన్న మీటర్ల వంటివే, అయితే వాటికి అదనంగా కమ్యూనికేషన్ (సమాచార మార్పిడి) సదుపాయం ఉంటుంది. వినియోగదారులు రీడింగ్ల ఖచ్చితత్వం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, స్మార్ట్ మీటర్ల వల్ల అధిక బిల్లింగ్ వస్తుందనే వదంతులను నమ్మవద్దు. ప్రస్తుతం మీ మీటర్ రీడింగులు తేది వివిధ కారణాల వలన ఖచ్చితమైన తారీఖున తీయడానికి కొన్ని సార్లు సాధ్యపడుట లేదు. ఇప్పుడు ఈ స్మార్ట్ మీటర్లవలన ఖచ్చితమైన తేదికి మీ మీటరు రీడింగ్ లు అన్నీ ఆన్లైన్లో తీయబడుతాయి. మీటర్ రీడీర్లు ఎవరు కూడా మీ ఇంటి ఆవరణలోనికి రానవరసం లేదు. మీటర్ రీడింగ్లు అన్నీ ఖచ్చితమైన తేదీకి రావడంవలన ఇప్పుడున్న మీటర్ల మాన్యువల్ బిల్లింగ్ సమయం దాటి తీసిన రీడింగ్ వల్ల వచ్చే అధిక స్లాబ్ బిల్లులను అరికట్టవచ్చును. మీకు బిల్లు కూడా ఖచ్చితంగా నెలకు (30/31) జారిచేయబడుతుంది. అలాగే ముందుగ ఛార్జీ చేసుకొని విద్యుత్ వినియోగించే విధానం ప్రస్తుతం అమలులో లేదు. అలాగే టారిఫ్ స్లాబ్స్ అన్నీ కూడా 24 గంటలు ఒకే విధంగా ఉంటుంది. 5. స్మార్ట్ మీటర్స్ అమర్చడం వలన, వినియోగదారునికి ఎటువంటి ఖర్చు ఉండదు. ఖర్చు అంతా విద్యుత్ సంస్థలు మరియు విద్యుత్ మంత్రిత్వశాఖ, కేంద్ర ప్రభుత్వం కలిసి భరిస్తాయి. ఈ మీటర్స్ అన్నీ కూడా ఆర్‌డీఎస్ఎస్ పథకంలో డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు, కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌తో అమర్చబడుతాయి.

# దుడ్డు ప్రభాకర్ ను వెంటనే విడుదల చేయాలి

## భారత రాజ్యాంగాన్ని దేశంలో అమలు చేయాలి

## రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)**



దేశంలో పీడిత కులాల ప్రజల కోసం గొంతు విప్పుతున్న ఉద్యమకారులను, ప్రజాస్వామ్యక వాదులను అక్రమంగా అరెస్టు చేయటం రాజ్యాంగం ప్రతిపాదించిన హక్కులకు భంగం కలిగించటమేనని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ పేర్కొన్నారు. కే ఎన్ పి ఎస్ ఆధ్వర్యంలో కే ఎన్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్ ని విడుదల చేయాలని ఒంగోలులోని అంబేద్కర్ భవనంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర సదస్సు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కు ప్రశ్నించే హక్కు, మాట్లాడే హక్కు, జీవించే హక్కు రాజ్యాంగంలో పొందుపరిస్తే, వాటిని కాలరాసే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రభుత్వాల మీద తమ అసంతృప్తిని వ్యక్తపరిచే హక్కు ప్రజలకు ఉందన్నారు. ప్రజల ఆకాంక్షల కోసం వారి హక్కు కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అన్నారు. ఉమ్మడి హైకోర్టు మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ ఏ సత్య ప్రసాద్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో ఉన్న నల్ల చట్టాలను దేశంలోని పౌరులపై, ప్రజాస్వామ్యకు వాదులపై ప్రయోగించడం దుర్మార్గమన్నారు. ఉపాసా లాంటి నల్ల చట్టాలను ప్రయోగించడం ప్రజల గొంతు నొక్కటమే అన్నారు. రాజ్యాంగబద్ధంగా ఉన్న వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, తప్పు దారి పడుతున్న వ్యవస్థల్ని ప్రశ్నించే జాతులపై ప్రయోగించడం తగదు అన్నాడు. కుల నిర్మూలన ఎజెండాతో, ప్రజల్లో ఉండి పనిచేస్తున్న దుడ్డు ప్రభాకర్ పై ఉపా కేసు ప్రయోగించి బెయిల్ నిరాకరించటం బాధాకరమన్నారు. వీక్షణ మెడికల్ వేణు గోపాల్ మాట్లాడుతూ దేశంలో ఉన్న సహజ ఓనర్లను, సంపదలు కార్పొరేట్లకు అప్పజెప్పడానికి ఛత్తీస్గడ్ లో ఉన్న ఆదివాసీలపై అత్యాచార, హత్యలు చేసి అడవి నుండి ఆదివాసీలను ఖాళీ చేయించి, కార్పొరేట్లకు అప్పజెప్పే కుట్రలో భాగంగానే ఆపరేషన్ కగార్ పేరుతో హింసను మొదలుపెట్టి దేశంలో ఉన్న పౌరులపై యుద్ధం చేస్తున్నారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ ప్రతిపక్షాలను అర్బన్ నక్సలైట్లుగా, ఇది ప్రజాస్వామ్యంలో ఎక్కువ కాలం ఉండదని అన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకటరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణయ్య అధ్యక్షత వహించారు. సదస్సులో విరసం రాష్ట్ర నాయకులు జి. కళ్యాణ్ రావు, నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు. చేనేత కార్మిక సమస్య రాష్ట్ర నాయకులు మాచర్ల మోహన్ రావు, ప్రజా కళామండలి రాష్ట్ర కార్యదర్శి జే. కోటి తదితరులు పాల్గొన్నారు.



# కంపు బాబోయ్ కంపు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)**

మున్సిపల్ వర్కర్స్ సమ్మెలో ఉండడంతో ఒంగోలు నగరంలోని భాగ్యనగర్ ఫోర్త్ లైన్‌లో మూడో క్రాస్ రోడ్ పై ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి రోడ్డు పై వెళు_ంటే దుర్వాసనతో భాగ్యనగర్ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల ఇళ్ళ మధ్య కూడా చెత్త కుప్పలు ఉండడంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది ఇకనైనా చెత్త కుప్పలను తొలగించాలని భాగ్యనగర్ ప్రజలు కోరుతున్నారు.





# స్మార్ట్ మీటర్లు మా ఇంటికి బిగించొద్దు

## ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యుత్ వినియోగదారుల నిర్ణయం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)

సిఐటియు జిల్లా కార్యాలయంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి గంటి నపల్లి శ్రీనివాసులు , ఏఐఎఫ్‌టీయూ న్యూ జిల్లా కార్యదర్శి ఎం ఎస్ సాయి , పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి సిహెచ్. పద్మ , ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశం స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, ట్రూ అఫ్ చార్జీలు రద్దు చేయాలని ,విద్యుత్ భారాలు రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూతెలుగు దేశం ప్రభుత్వం అధికారం లోకి రావడానికి వివిధ వర్గాల ప్రజలకు 176 వాగ్దానాలు చేసింది .మొత్తం ప్రజలందరికీ సంబంధించిన వాగ్దానాలు అందులో రెండు ఉన్నాయి. విద్యుత్ బిల్లులు భారాలు తగ్గింపు ఒకటిగా , పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించడం రెండవది పై హామీలను అమలు చేయడంలో చంద్రబాబు సర్కారు ఘోరంగా విఫలమైంది. పైగా విద్యుత్ ఛార్జింగ్ తగ్గించకపోగా 2023 24 ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో 9412 కోట్ల రూపాయల భారాలను రాష్ట్ర ప్రజలపై వేసింది. అందులో భాగంగానే యూనిట్కి 40 పైసలు చొప్పున ఎలాంటి అనుమతులు లేకుండా ట్రూ అప్ చార్జీలతో పాటు 2023 24 రన్నింగ్ లోనే అదనంగా వసూలు చేశారు. అలా వసూలు చేసిన 2869 కోట్ల రూపాయలు ఫోను 6543 కోట్ల రూపాయలను చార్జీలు ఇప్పుడు వసూలు చేస్తున్నారు. ఈ భారాన్ని వెంటనే తగ్గించాలని కొండారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ జనశక్తి జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం బందిపోటు దోపిడి ఇక్కడితో ఆగలేదు స్మార్ట్ మీటర్ల పేరుతో మరో దోపిడీ తెర మీదకు తెచ్చి ప్రజలపై వేల కోట్ల రూపాయలు భారాలను వేస్తున్నది. స్మార్ట్ మీటర్లు కేవలం ఆర్థిక భారానికి సంబంధించినది మాత్రమే కాదు అది మన గృహ విద్యుత్ వినియోగాన్ని సుదూర ప్రాంతం నుండి కంట్రోల్ చేయగల ఒక పరికరం .ఇది అన్ని రకాలుగా ప్రజలకు నష్టదాయకం. అందుకే ఈ స్మార్ట్ మీటర్ల భూతాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని రౌండ్టేబుల్ సమావేశంలో మాట్లాడారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూ రురంగారావు మాట్లాడుతూ టిడిపి అధికారానికి రాకముందు చార్జీలను వ్యతిరేకించడమే కాకుండా రైతుల పొలాల్లోని విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్ల బిగింపును టిడిపి ,జనసేన పార్టీలు వామపక్ష పార్టీలు మించి తీవ్రంగా విమర్శించాయి. నేటి విద్యా శాఖ మంత్రి లోకేష్ ఆనాడు స్మార్ట్ మేటర్ ను పగలగొట్టాలని తెలుగుదేశం మీకు అండగా ఉంటుందని పిలుపునిచ్చారు. కానీ టిడిపి కూటమి అధికారం వచ్చినాక ఈ విషయంలో వైసిపి అడుగుజాడల్లో నడుస్తున్నది. అంతకు మించిన విద్యుత్ బారాలను వేస్తున్నది. తాము పగలగొట్టాలనుకున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇప్పుడు పొలాలతో పాటు షాపులకు ఇ ళ్లకు బిగించేందుకు వారే సిద్ధమై ఓట్లు వేసిన ప్రజలను పచ్చి మోసం ద గా చేస్తున్నారు .నగ్నంగా రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ఈ నయ వంచనను వ్యతిరేకించాలని రంగారావు కోరారు. సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో భగత్ సింగ్ కాలనీలో మీటర్లను అడ్డుకోవడం జరిగింది. విద్యుత్తు ఆఫీసు వద్ద ధర్నా చేపట్టడం జరిగింది .అనేక వార్డుల్లో కరపత్రాలు పంచి ప్రజలను చైతన్య వంతులను చేసేటి కార్యక్రమం చేశాము. ప్రజలు స్మార్ట్ మీటర్లు వద్దని చెప్పి నిరసన వ్యక్తం చేస్తా అన్నారు. ఈ పోరాటంలో మేము కూడా పాలు పంచుకుంటామని శ్రీనివాసులు తెలిపారు .ఈ కార్యక్రమంలోరైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలిత కుమారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అర్జీ లు పెట్టించాలని కోరారు.ధామ శ్రీనివాసులు , కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య ,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జె .జయంతి బాబు ,పౌర సంఘాల సమాఖ్య నాయకులు జి రమేష్ , ఎఎప్టియు నాయకులు విజయసారథి, సుల్తాన్ భాష ,కె విపి ఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురాం , ఐద్వా జిల్లా కార్యదర్శి కే రమాదేవి , శ్రామిక మహిల జిల్లా కార్యదర్శిపి .కల్పన , కే హనుమంతరావు , ఐఎల్పి జిల్లా కన్వీనర్ దాసరి సుందరం , తంబి శ్రీనివాసులు , ఎల్.రాజశేఖర్ , ఎం.అయ్యపరెడ్డి , వీరస్వామి ,విజయ సారధి , మున్వర్ భాష , చుంచు శేషయ్య ,తదితరులు రిటైర్డ్ నాయకులు జి శేషయ్య , సుబ్బారావు , ఎస్సీ రామకృష్ణ , దాసరి సుందరం, తదితరులు పాల్గొన్నారు

# పరిశుభ్రతే ప్రగతికి సోపానం



**స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్**

**ప్లాస్టిక్‌ను నిషేధించి, పర్యావరణాన్ని కాపాడుకుందాం**

**భవిష్య తరాల భద్రత కోసం పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత**










(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)

ప్రతి నెల మూడో శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ పోలీస్ అధికారులు, సిబ్బంది కలిసి స్వచ్ఛత, శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, ర్యాలీ నిర్వహించి, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను కూడా చేశారు. పోలీస్ కార్యాలయ ఆవరణను శుభ్రం చేయడంతో పాటు చుట్టుపక్కల చెత్తను తొలగించి, పిచ్చి మొక్కలను గుణపం, పారలతో తీసివేశారు. ఇలా శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ, పర్యావరణ పరిరక్షణకు తమ పాత్రను పోషించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి విధి అని, స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం ద్వారా మనం మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే గాక, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో ప్లాస్టిక్ వ్యర్థాల ప్రాబల్యం ఒకటని, ఒక్కసారి ఉపయోగించి పారేస్తున్న ప్లాస్టిక్ వస్తువులు వందల ఏళ్ల పాటు ప్రకృతిలో కరుగకుండా ఉండి, మానవజాతికి, వన్యప్రాణులకు, మరియు సముద్ర జీవరాశికి ముప్పుగా మారుతున్నాయని, ఈ విషయంలో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మన చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆహ్లాదకరమైన, ప్రశాంత వాతావరణం ఏర్పడుతుంది. అలాంటి వాతావరణంలో మనస్సు ప్రశాంతంగా ఉండి, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, ఉత్తమ పనితీరుతో తమ విధులను నిర్వహించగలరని పేర్కొన్నారు. పర్యావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనీ, మన చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలనీ సూచించారు. ఈరోజు మనం తీసుకునే చర్యలు రేపటి తరాల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని గుర్తించి, పరిశుభ్రతపై మనం చూపే శ్రద్ధ వారికి మంచి జీవన వాతావరణాన్ని అందించడంలో కీలకమవుతుందని అన్నారు. పరిసరాల పరిశుభ్రత గురించి, ప్రజలకు అవగాహన కల్పించడం వంటివి ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర గురించి, గుడ్, బ్యాడ్ టచ్, మాదక ద్రవ్యాల వలన జరిగే అనార్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలపై జిల్లా ఎస్పీ అవగాహన కల్పించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడా తెలుసుకోవడం, ప్రేమ పేరుతో జరిగే మోసలపట్ల, చట్టాల పై, ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి కూడా అవగాహన కల్పించారు. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. డిజిటల్ అరెస్ట్ అనగా పోలీస్, సిబిఐ, వివిధ ఉన్నత శాఖల అధికారులంటూ ఫోన్ చేసి డబ్బులు వసూలు చేయడం వంటి ఇతర సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, విద్య మరియు భవిష్యత్తు గురించి వివరించారు. తల్లిదండ్రులకు బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని నడపాలని విద్యార్థులకు తెలియచేసారు. విద్యార్థి దశ నుండి మంచి క్రమశిక్షణ కలిగి, చదువుకున్నటువంటి వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఈ అవగాహన కార్యక్రమంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, పోలీస్ యూనిట్ డాక్టర్ భానుమతి, ఆర్ఐ లు రమణ రెడ్డి, సీతారామిరెడ్డి, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

**జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్**

**ఒంగోలు టౌన్‌లో డ్రోన్ కెమెరాలతో పటిష్ట నిఘా చేపట్టిన ప్రకాశం జిల్లా పోలీస్‌లు**

**పట్టణ శాంతిభద్రతల కోసం ఆకాశ మార్గంలో నిఘా**





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)

జిల్లాలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేయాలని లక్ష్యంగా జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బంది డ్రోన్ కెమెరాలతో క్షేత్రస్థాయిలో ఒంగోలు టౌన్‌లో 35 డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఒంగోలు టౌన్ పరిధిలో శివారు, ట్రాఫిక్ నియంత్రణ, నిర్మానుష్యమైన ప్రదేశాలలో బహిరంగంగా మద్యం సేవించడం, నేరాలు జరగటానికి ఆస్కారం ఉన్న ప్రదేశాలు, ఈవిటిజింగ్, చైన్ స్నాచింగ్, పేకాట, జూదం తదితర నేరాలపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక దృష్టి సారించి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డు కట్టు వేస్తున్నారు. క్రైమ్ ప్రోన్ ఏరియాల పై డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నిరంతరం జిల్లా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న నిశితమైన ప్రదేశాలు పాడుపడిపోయిన బంగ్లాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలను, పార్కులు ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి, నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలను అదుపు చేసేందుకు మరియు ప్రజల భద్రతను పెంపొందించేందుకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయటం జరిగింది. జిల్లా పోలీసులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. బైక్ రైసింగ్, ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌లపై నిఘా ఏర్పాటు చేశారు.





# గుర్రపుశాలలో సుపరిపాలనతో తొలి అడుగు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, జులై 19)

యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు శనివారం యర్రగొండపాలెం మండలంలోని గుర్రపుశాల గ్రామంలో 44వ బూత్ సుపరిపాలనలో తెలుగుదేశం పార్టీ నాయకులు తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దఎత్తున పాల్గొని ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల మద్దతుతో ముందుకు సాగుతున్న ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాల అమలుతో పేద ప్రజల జీవితాల్లో చోటుచేసుకున్న మార్పు, గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న వేగవంతమైన అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పిట్టమల్ల బొర్రయ్య, మాజీ డీలర్ దూదేకుల జాన్, దారా నాగేశ్వరరావు, ముండ్ల దయాకర్, బీసీసెల్ యువ నాయడుకు దూదేకుల నాగుల్ మీరా, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత ప్రపంచంపై అవగాహన







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులు, ఎస్పీ ప్రకాశం ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం జరిగే స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడులోని మద్దులూరు రోడ్డు నందు ప్లాస్టిక్ రహిత ప్రపంచం అనేదానిమీద అవగాహన కార్యక్రమం జరిగినది. దీనిలో భాగంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఒంగోలు రూరల్ సర్కిల్, ఎన్.శ్రీకాంత్ బాబు ఆధ్వర్యంలో సంతనూతలపాడు ఎస్సై వి.అజయ్ బాబు, తన సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అందరూ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని, 120 మైక్రాన్ ల కంటే తక్కువ ఉండే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని ఆపి రీయుజబుల్ ప్లాస్టిక్ ని వాడాలని పేర్కొన్నారు. అందుకుగాను ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రోడ్లపై ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, ప్రజలకు అవగాహన కల్పించినారు. దీనిలో భాగంగా పర్యావరణ పరిరక్షణ మరియు ప్లాస్టిక్ పదార్థాలను వస్తువులను వినియోగించమని ప్రజల చేత, పోలీసు సిబ్బంది చేత ఒంగోలు రూరల్ సీఐ ఎం శ్రీకాంత్ బాబు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు రూరల్ సిఐతో ఎస్సై అజయ్ బాబు, ఒంగోలు రూరల్ సర్కిల్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వద్దు - బట్ట సంచులే ముద్దు






(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 19)

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బోగనంపాడు గ్రామంలో ఎంపీడీవో పి.సుజాత అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులను నిషేధిద్దాం, పేపర్, జూట్ సంచులను వాడదామని తెలిపారు. గ్రామస్తులకు దుకాణదారులకు ప్లాస్టిక్ పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి నాగేశ్వరరావు, వ్యవసాయ అధికారి రాము, ఎంపీటీసీ రామాంజనేయులు, డి.వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు ప్రజలు పాల్గొన్నారు.

# బాధితులకు న్యాయం అందించే దిశగా అడుగులు వేయాలి

## అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశంలో ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)

జిల్లాలోని పోలీసు,న్యాయ, రెవెన్యూ, రవాణా, విద్యా, వైద్య, విద్యుత్, ఇతర శాఖల ఉన్నతాధికారుల సమక్షంలో అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశం ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ నిర్వహించారు. గత ఆరు నెలల నేరాల తీరుపై సమగ్ర సమీక్ష, బాధితులకు న్యాయం అందించే దిశగా అడుగులు వేయాలన్నారు జిల్లా ఎస్పీ పలు శాఖల సమన్వయంతో పోలీసుల సందేహాల నివృత్తి చేసారు. ఆధునిక సాంకేతిక పద్ధతులతో కేసుల పరిష్కార వేగాన్ని పెంచాలన్నారు. మహిళా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, శక్తి టీమ్స్ ద్వారా అవగాహన, నిఘా వ్యవస్థ బలోపేతం చేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్‌లు, విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అన్నారు. మైనర్ల వాహనాలు నడపటం, తప్పుదోవ పట్టించే కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కారం చేయడంలో కృషిచేసిన పోలీస్ అధికారులు మరియు సిబ్బందిని అభినందించారు. పల్లె నిద్ర'తో స్థానిక సమస్యల పరిష్కారం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి. జిల్లాలోని పోలీసు, రెవెన్యూ, న్యాయ, రవాణా, విద్యా, వైద్య,ఇతర శాఖల ఉన్నతాధికారుల సమక్షంలో ఒంగోలు సమీపంలోని రైజ్ కాలేజీలో అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశాన్ని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రిన్సిపల్ , సెషన్స్ జడ్జి ఏ. భారతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా జడ్జి ఏ.భారతి మాట్లాడుతూ నేర నియంత్రణలో పోలీసు,న్యాయ వ్యవస్థల సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. నేరాల విచారణ వేగవంతంగా జరిగే విధంగా సాక్ష్యాలు సమర్పించాలని, న్యాయ విచారణ సరైన దిశలో సాగుతుందన్నారు. పోలీసులు నమోదు చేస్తున్న కేసుల నాణ్యత, సాక్ష్యాల మీద న్యాయ తీర్పులు ఆధారపడతాయని అభిప్రాయపడ్డారు. అలాగే న్యాయ వ్యవస్థలో పెండింగ్‌లో ఉన్న కేసుల తక్షణ పరిష్కారం కోసం పోలీస్–కోర్టుల మధ్య సమన్వయ సమావేశాలు తరచూ నిర్వహించాలన్నారు. కేసు నమోదు, ఎఫ్ఐఆర్, రిమాండ్, ప్రాపర్టీ సీజ్, ముద్దాయిలు అరెస్టు, ఛార్జ్‌షీట్ దాఖలు అంశాలపై ఎదురయ్యే లీగల్ సమస్యలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా మా దృష్టికు తీసుకువస్తే పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరినీ బాధ్యతగా వ్యవహరించేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. హిట్ అండ్ రం కేసులో బాధితులకు సకాలంలో పరిహారం అందే విధంగా ఇంకా కృషి చేయాలన్నారు. ఎగ్జిట్ చేయాలని, సమన్స్ సకాలంలో సర్వ్ చేయాలన్నారు. ఫోక్సో, మహిళా సంబంధిత కేసులో పలు సూచనలు తెలియజేశారు. గడచిన ఆరు నెలల కాలంలో నమోదైన గ్రేవ్ , నాన్ గ్రేవ్ కేసులు, హత్య కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ తదితర అంశాలపై జిల్లా ఎస్పీ సమీక్ష నిర్వహించారు ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం, పోలీసులు తీసుకున్న చర్యలపై జిల్లా ఎస్పీ ఆరా తీసి, పోలీస్ అధికారులకు పలు సూచనలు, సలహాలు తెలిపారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ మాట్లాడుతూ గడచిన ఆరు నెలల నేరాల తీరును విశ్లేషించడం ద్వారా, నేర నియంత్రణకు అనుసరించాల్సిన విధివిధానాలపై ఒక అవగాహన ఏర్పడుతుందన్నారు. వాటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవడానికి వీలు పడుతుందన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని, మరింత సమర్ధవంతంగా పని చేస్తూ అందరి సమిష్టి కృషితో బాధితులకు న్యాయం చేసే దిశగా ముందడుగు వేయాలని సూచించారు. సమర్ధవంతమైన దర్యాప్తు కోసం ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించి కేసుల పరిష్కార వేగాన్ని పెంచాలని ఎస్పీ గారు ఆదేశించారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు కృషి చేస్తూ, నేరాల నిరోధానికి నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, శక్తి టీమ్స్ ద్వారా ప్రతి ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మహిళలు ధైర్యంగా తమ సమస్యలను చెప్పుకునే వాతావరణాన్ని కల్పించాలని, నేరం జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలలో శక్తి టీమ్ బృందాలతో నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారణ జరిపి, వారిని త్వరగా గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యంత తీవ్రమైన నేరాల్లో విచారణను వేగంగా పూర్తి చేసి, నిందితులపై త్వరితగతిన ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. గంజాయి, మత్తు పదార్థాలపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని, డ్రగ్స్, గుట్కా, ఇతర నిషేధిత పదార్థాల విక్రయంపై నిరంతర దాడులు చేస్తూ, వాటి విక్రయాల్లో ఎవరు పాల్గొన్నా, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల సమీపాల్లో మైనర్లను తప్పుదోవ పట్టించే కార్యకలాపాలను నియంత్రించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ, అవసరమైతే కేసులు నమోదు చేసి, వారి తల్లిదండ్రులకు, మైనర్లకు కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు 'పల్లె నిద్ర' కార్యక్రమంలో భాగంగా గ్రామాలు సందర్శించినప్పుడు, స్థానిక సమస్యల పరిష్కారంతో పాటు బాల్య వివాహాలు, మహిళల హక్కులు, 'పోక్సో' చట్టం వంటి అంశాలపై కూడా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం మరియు విశ్వాసం పెరిగేలా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యత తెలియజేసి ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా, విద్యా, వైద్య, న్యాయ మరియు ఇతర సంబంధిత శాఖల జిల్లా ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్డిపిఎస్ కేసుల దర్యాప్తు సమయంలో ఉన్న సందేహాలను న్యాయ నిపుణులు పోలీసులకు నివృత్తి చేశారు. జిల్లా స్థాయిలో సీసీ కెమెరాల ఏర్పాటు, భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలు,ఈగల్ ఏర్పాటు వంటి అంశాలపై చర్చ జరిగింది. అలాగే సమన్లు, వాట్సాప్ నోటీసులు, 'ఈ–సాక్ష్యా' యాప్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోల నిర్వహణకు సంబంధించిన సాంకేతిక సమస్యలు, ఎస్సీ, ఎస్టీ చట్టం, పోక్సో వంటి చట్టాల కింద బాధితులకు అందాల్సిన నష్టపరిహారాలపై జిల్లా పోలీసు అధికారులకు ఉన్న సందేహాలను ఆయా శాఖల ఉన్నతాధికారులు నివృత్తి చేశారు. ఇతర విచారణలకు అవసరమైన సహకారాన్ని జిల్లా పోలీసు శాఖకు అందించేందుకు న్యాయ, రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా, జైలు శాఖ, ఆర్ అండ్ బి, ఎన్ హెచ్ ఏఐ,విద్యా, విద్యుత్తు, ఆర్పిఎఫ్, జిఆర్ పి పోలీస్ లు, లేబర్ డిపార్ట్మెంట్ మరియు తదితర శాఖలు పూర్తిగా సహకరిస్తాయని అధికారులు తెలిపారు. ఈ నేర సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే నాగేశ్వరరావు, ఒంగోలు డి.ఎస్.పి ఆర్. శ్రీనివాసరావు, దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ, కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి రమణ కుమార్, ఏ ఆర్ డి ఎస్ పి కే శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వై ప్రశాంతి కుమారి,జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ లు వసుంధర, స్పెషల్ పీపీ జి.శ్రీనరెడ్డి, సబ్ రిజిస్టర్ కె. శ్రీనివాసరావు,జిల్లా జైలర్ అప్పలనాయుడు, ట్రాన్స్కో, వీరయ్య, ఎన్ హెచ్ ఏఐ పిడి అనిల్ కుమార్ రెడ్డి, ఆర్ అండ్ బి , గోపి నాయక్, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, అడిషనల్ పిపిలు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

## - ఇది ప్రజా ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 19)



కందుకూరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు మండలం మోపాడు గ్రామంలో శనివారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కందుకూరు శాసనసభ్యులు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా తమ గ్రామానికి విచ్చేసిన ప్రియతమ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకి గ్రామస్తులు మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి మరియు సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధి వైపు దూసుకెళ్తుందని తెలిపారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులైన రోడ్లు, కాలువలు మరియు ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని తెలియజేశారు. గ్రామంలో ఇంకేమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువచ్చినచో వాటి పరిష్కారాన్ని కృషి చేస్తానని తెలియజేశారు... త్వరలోనే సొంత స్థలం ఉన్న వారికి హౌసింగ్ స్కీమ్ ద్వారా ఇల్లు నిర్మిస్తామని, ఇంటి స్థలాలు లేని వారికి లేని వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇల్లు కట్టిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల జరిగిన నష్టాలను బట్టి భర్తీ చేసుకుంటూ ఆర్థిక లోటు పాటులను సరిచేసుకుంటూ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తూ ముందుకు కూటమి ప్రభుత్వం వెళ్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రతి పేద వారి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందించాలని సంకల్పంతో పనిచేస్తుందని ఏడాది కూటమి పాలనలో అన్ని వర్గాల్లో ఎంతో ఆనందంగా ఉన్నారని ముఖ్యంగా మహిళలు వృద్ధులు, విద్యార్థులు యువతకు నేరుగా సంక్షేమ పథకాలను అందించడంతో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పాడి రైతుల కోసం గోకులం షెడ్లు, సబ్సిడి కింద యంత్ర పరికరాలు , బీసీ ఎస్సీ, ఎస్టీ యువతకు ఉపాధి కొరకు బ్యాంకు లోన్లు ఇలా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందజేస్తుందని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు హరికృష్ణ పార్టీ నాయకులు రావుల రవి తన్నీరు ఏడుకొండలు బెల్లంకొండ సింగయ్య, తోకల వీరేష్, బోడపాటి నారాయణ చెన్నారెడ్డి ఆదిశేషు , గుళ్ళా శ్రీనివాసులు, సూరం చిరంజీవి రెడ్డి, వీరారెడ్డి, మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# తాటిపర్తి నోరు అదుపులో పెట్టుకో

## టీడీపీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 19)

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పై ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అనవసరంగా నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకోబోమని నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే హెచ్చరించారు. తాటిపర్తి చంద్రశేఖర్ లాగా పదవి కోసం పది పార్టీలు మారే మనస్తత్వం వర్ల రామయ్యది కాదన్నారు. నీతికి, నిజాయితీకి మారుపేరుగా వర్ల రామయ్య నిలిచారని మోషే గుర్తు చేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో కొండపి నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించి మా అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే టికెట్ నిరాకరిస్తే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పంచన చేరిన నువ్వు 2019 - 2024 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగితే ఏనాడు నోరు మెదపని నువ్వు వర్ల రామయ్య గురించి మాట్లాడతావా చంద్రశేఖర్ అంటూ మోషే ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగల పక్షాన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి వర్గీకరణకు సానుకూలమైన వాతావరణాన్ని వర్ల రామయ్య కల్పించారనే విషయాన్ని చంద్రశేఖర్ గుర్తుంచుకోవాలని మోషే మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి తో ఎస్సీ వర్గీకరణ విషయం మీద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిప్రాయాన్ని కూడా చెప్పించలేని కుహనా నాయకులారా మీరా వర్ల రామయ్యను విమర్శించేది అని చంద్రశేఖర్ పై మోషే ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలి



## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి









**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 19)**

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాన్ని వివరిస్తూ అవగాహన ర్యాలీని శనివారం స్థానిక బాపట్ల పట్టణంలో నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం ప్రాణాంతకం, భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకుందాం, ప్రకృతిని ప్రేమిద్దాం- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ విద్యార్థులు పెద్దపెట్టున నినదించారు. ర్యాలీలో 2000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా చెత్త డంపింగ్ యార్డు వద్దకు చేరుకున్న వేలాదిమంది విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై కలెక్టర్ స్వయంగా అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి కలిగే నష్టాన్ని వివరించారు. ఈ తరం ప్రజలు చేస్తున్న పొరపాట్లు రాబోయే తరాలకు నష్టాన్ని కలిగించరాదన్నారు. చెత్తతో భూమి, వాయువు, జలాలు కాలుష్యం గాకుండా ప్రజలు, పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులు చైతన్యంతో భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలని కోరారు. భూమిలో కుళ్ళిపోయే వ్యర్థాలు ఒక బుట్టలో, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరొక బుట్టలో వేసేలా మీ ఇంటి నుంచి వ్యర్థాలను విభజించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజలందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా కలెక్టర్, బాపట్ల శాసనసభ్యులు కలసి పారిశుద్ధ్య కార్మికులను పుష్పమాలతో సత్కరించారు. క్యాన్సర్ వ్యాధికి కారణమయ్యే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తి, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా నిషేధించామని జిల్లా కలెక్టర్ వెంకట మురళి ప్రకటించారు. ప్రమాదకరంగా మారుతున్న ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించుకోవాలన్నారు. ప్లాస్టిక్ రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు మార్గనిర్దేశం చేశామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అత్యంత ప్రమాదకరమైనదనే విషయం ప్రజలు గుర్తించాలన్నారు. పశువులు, మత్స్య సంపద మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను 70 శాతం జిందాల్ కు తరలించామన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమంపై దృష్టి సారించామన్నారు. దశాబ్దాలుగా ప్లాస్టిక్ కవర్లు, సంచులు వినియోగించే అలవాటును ప్రజలు మార్చుకోవాలన్నారు. భావితరాల కోసం నేటి యువత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రకృతికి ఎలాంటి హానిలేని శ్రేయస్కరమైన గుడ్డ సంచులు, స్టీల్, కాగితపు గ్లాసులనే వాడాలన్నారు. ప్రకృతిని ప్రేమించే వారిగా నేటి విద్యార్థులు ఎదగాలని ఆయన సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు పూర్తిగా నిలిపి వేయాలని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు బాపట్ల జిల్లాలో విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణలో జిల్లా కలెక్టర్ బాగా పనిచేస్తున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాలు మరింత విస్తృతం కావాలన్నారు. ప్రజలు సుభిక్షంగా జీవించడానికి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను ప్రజలు గుర్తించి, నిలిపివేయాలన్నారు. ప్రజల్లో చైతన్యం రావాలని ఆయన కోరారు. రానున్న తరాల కొరకు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. ప్రభుత్వం రూపొందించిన చట్టాలను ఎవరు ఉల్లంఘించారాదన్నారు. ప్రమాదాల నుంచి తప్పించుకోవడానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలన్నారు. సమాజమే దేవాలయంగా భావించాలాన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తి, అమ్మకాలు, వినియోగం వద్దు బ్రో అంటూ విద్యార్థులకు సూచించారు. కుళ్లిపోయే స్వభావం ఉన్న వాటిని, లేని వాటిని ఇంటి వద్ద నుంచి వేరు చేయాలని బుడ చైర్మన్ సలగాల రాజశేఖర్ బాబు తెలిపారు. ప్లాస్టిక్ పదార్థాలకు కుళ్లిపోయే స్వభావం లేనందున నష్టం అపారంగా ఉందన్నారు. నాగరికత మనిషి మనుగడకు ప్రమాదంగా మారిందన్నారు. వాటిని గుర్తించి, సమాజాన్ని కాపాడుకునేలా జాగ్రత్తగా మెలగాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే పర్యావరణాన్ని పరిరక్షించుకోగలమని జిల్లా రెవిన్యూ అధికారి, పురపాలక సంఘం ప్రత్యేక అధికారి జి గంగాధర్ గౌడ్ తెలిపారు. మనం నివాసం నివసించే చుట్టూ పక్కల ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మానవ మనుగడకు పెనుభూతంగా మారుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ప్రభాకర్‌రావు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఆర్డీవో గ్లోరియా, సిపిఓ షాలేమ్ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల పై ప్రైవేట్ పెత్తనం సహించం

**అలా చేస్తే రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసినట్టే**
**పెండింగ్ ప్రాజెక్టులు గాలికి వదిలిన ప్రభుత్వం**
**బనకచర్ల పేరుతో కొత్తరాగం**
**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ద్వజం**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)**

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పటం హాస్యాస్పదంగా ఉందని, అలా చేస్తే రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసినట్టేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ద్వజమెత్తారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో స్వాతంత్రం వచ్చిన తర్వాత ఏ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యం ఎక్కడా లేదన్నారు. కొత్తగా ఆంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో ప్రాజెక్టును నిర్మిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి చెప్పటాన్ని సిపిఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు . గత వైసిపి ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలని కేంద్రం సూచించింది అన్నారు.. ప్రస్తుతం డబల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరోసారి పోలవరం ఎత్తుపై రాజకీయం చేస్తుందన్నారు. 45.75 అడుగుల ఎత్తును నీటి నిల్వ చేసుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. అలా కాకుండా 41. 5 అడుగులు మాత్రమే నీటిని నిలవ కు కేంద్రం అనుమతిస్తే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రూ. 82 వేల కోట్లతో పోలవరం బనక చర్ల ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్తున్న ప్రభుత్వం, ప్రాజెక్ట్ పూర్తయ్య నాటికి అంచనా వ్యయం రెండు లక్షల కోట్లకు తీసుకెళ్తారని విమ ర్శించారు. ప్రాజెక్టు నిర్మాణంలో ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యాన్ని ఏ రాజకీయ పార్టీ, రైతు సంఘాలు, ప్రజలు ఎవరూ అంగీకరించరని తెలిపారు.దీనిపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ప్రజలను పక్కదారి మళ్లీంచేందుకే పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులను తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో వెలుగొండ, హంద్రీనీవా,గాలేరు, నగరి,వంశధార,నాగవల్లి ప్రాజెక్టుతో పాటు అనేక చిన్న, మధ్య ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాలువలు నిర్మాణానికి నోచుకోక పెండింగ్లో ఉన్నాయన్నారు.వాటిని గాలికి వదిలి కొత్త ప్రాజెక్టు పేరుతో ప్రజలను పక్కదారి మల్లించేందుకే తెరపైకి బనకచర్ల ప్రాజెక్టు ను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలనలో రూ. లక్ష 70 వేల కోట్లు అప్పులు చేస్తే తప్ప అభివృద్ధి ఎక్కడ కనిపించటం లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడైనా అభివృద్ధి జరిగిందంటే అది కేవలం సంపన్నుల కొరకు%% ఉపయోగపడే అభివృద్ధిననీ విమర్శించారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం రూ 31 వేల కోట్లు ఇప్పటివరకు అప్పు తెచ్చారని పేర్కొన్నారు. తెచ్చిన అప్పులు వడ్డీ కట్టడానికే సంవత్సరానికి రూ. 70 వేల కోట్లు అవసరం అవుతాయని తెలిపారు. అమరావతిలో మరో 30 వేల ఎకరాలు సేకరణకు, అదేవిధంగా నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు వద్ద ఇండోసోల్ కంపెనీ కి 8500 ఎకరాలు భూసేకరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం బట్టి చూస్తే చంద్రబాబు నాయుడుకు భూ దాహం పట్టిందని పేర్కొన్నారు. కరేడు వద్ద మూడు పంటలు పండే భూములను ఇండోసోల్ కంపెనీకి కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, అయితే సముద్ర తీరంలో వేల ఎకరాలు పంటల పండని భూములు ఉన్నాయని, వాటిని పరిశ్రమలకు కేటాయించాలని సూచించారు. ఎన్నికల ముందు అవినీతిని ప్రశ్నించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. రాష్ట్రంలో బియ్యం అక్రమ రమణా జోరుగా జరుగుతుందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి బాగా పెరిగిపోయిందని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై పవన్ కళ్యాణ్ నోరు మెదపడం లేదన్నారు. పవన్ కళ్యాణ్ బిజెపి – ఆర్ఎస్ఎస్ భజన చేస్తూ గుడి గోపురాలు చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. దొంగలు దొంగలు ఊర్లు బంచుకున్నట్లు పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప మరొకటి చేయటం లేదని విమర్శించారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడం సహజమే అయితే ఆ విమర్శలు అవతలి వ్యక్తుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఉండకూడదని రామకృష్ణ సూచించారు.ముఖ్యంగా ఇటీవల కాలంలో మహిళపై వైసిపి నాయకులు ,తెలుగుదేశం పార్టీ నాయకులు శృతి మించి విమర్శించుకోవడం మంచి పద్ధతి కాద న్నారు. మహిళలపై చేస్తున్న విమర్శలను సిపిఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందంటారు. అలాంటి విమర్శలపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి స్పందించి వారి పార్టీ నాయకులను కంట్రోల్ చేసుకోవాలని, లేకుంటే ప్రజలే తిరగబడతారని హెచ్చరించారు. ఆగస్టు 23, 24,25 తేదీలలో ఒంగోలులో సిపిఐ రాష్ట్ర మహాసభల్లో జరుగుతున్న రాష్ట్ర అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి అవసరమైన సంక్షేమంపై చర్చించి తీర్మానించి ప్రజల ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ వెంకట్రావు,నగర పార్టీ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు యుగంధర్ లు పాల్గొన్నారు.

# బాలుడికి ఆర్థిక సాయం అందించిన సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)**

సంతనూతలపాడుకి చెందిన షేక్ అబ్దుల్ గఫూర్ అనే బాలుడికి కొన్ని సంవత్సరాల క్రితం నాన్న క్యాన్సర్‌తో చనిపోయాడు అమ్మ కూడా ఈమధ్య అనారోగ్యంతో చనిపోయింది. ఈ బాబు కుటుంబ పోషణ భారం స్కూల్ ఫీజు వృద్ధురాలు అయిన షేక్ మహబూబ్ బీ కి కష్టంగా మారింది. వారి ఒక కష్టం తెలుసుకున్న సూర్యా శ్రీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ షహనాజ్ ప్రవాస భారతీయుడు రాజు గోపాల్ సహకారంతో ఆ విద్యార్థి ఫీజు రూ.16,000లు నేరుగా స్కూల్‌కి వెళ్లి మండవ మురళి కృష్ణ చెల్లించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ ఎస్కే సర్దార్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# 1 నుండి ప్లాస్టిక్ చేతిలో కనిపిస్తే రూ.20 ఫైన్

**స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్రాలో ఎమ్మెల్యే దామచర్ల స్పష్టం**










**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)**

సమాజం బాగుండాలి....అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రజలు కూడా సహకరించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు కోరారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలన లక్ష్యం నినాదంతో ఒంగోలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అద్దంకి బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. పరిసరాలు బాగుంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ వస్తుందని, ప్లాస్టిక్ కారక వస్తువులు తిని ఆవులు చనిపోతున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులను ప్రజలు వినియోగించాలని సూచించారు. ఆర్పీలు కూడా తమ సమావేశాల్లో ప్లాస్టిక్ రహిత వాడక వినియోగంపై మహిళలకు అవగాహన కలిగించాలని దామచర్ల జనార్దన్ రావు సూచించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ మన ఆరోగ్యం కోసం ప్లాస్టిక్కు నిషేధించుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వస్తువులు వాటిని తిని మరణిస్తున్నాయని, సముద్ర తీరంలో కూడా వీటిని వేయడం వల్ల జీవరాసులు దెబ్బతింటున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ ని కచ్చితంగా నిషేధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ పూర్తిగా నిర్మూలించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుండే శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు. ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. సచివాలయం సిబ్బంది దీనిని ఛాలెంజ్ గా తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ ఫ్రీజోన్లుగా ఉండే సచివాలయాలకు అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీహరి, స్టెప్పు సీఈఓ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉన్నప్పటికీ పదిమంది కార్మికులు బాధ్యతగా ముందుకు వచ్చి పారిశుధ్య పనులు చేయడం పట్ల ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు, సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ వారిని సన్మానించారు. పలువురు శానిటేషన్ సెక్రటరీ లను కూడా సన్మానించారు.

# పేదరికం లేని సమాజమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

### రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం, జులై 19)**





పేదరికం లేని సమాజమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. శనివారం మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని తర్లుపాడు మండల కేంద్రంలో 50 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి తో ప్రారంభోత్సం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాని కట్టుబడివుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లాలో ఇప్పటివరకు 9 కోట్ల రూపాయలతో 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మించడం జరిగిందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఈ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. ఎవరికైనా గుండె నొప్పి వస్తే వెంటనే ఈసిజి తీసి అవసరమైతే 40 వేల రూపాయల విలువ గల ఇంజెక్షన్ ను స్టేమి కార్యక్రమం కింద సంబంధిత వ్యక్తికి వేసే సదుపాయాన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కల్పించడం జరిగిందన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్ టి ఆర్ వైద్య సేవల కింద చాల సేవలను అందచేయడం జరుగుచున్నదన్నారు. తొందరలోనే 25 లక్షల రూపాయల వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందించేలా గొప్ప ఇన్సురెన్స్ పాలసీ ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా ఆరోగ్యాంధ్ర ప్రదేశ్, ఆనందదాయక ఆంధ్రప్రదేశ్, లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటె అందంగా ఉంటారన్నారు. మన ఇల్లు, మన వీధి, మన గ్రామం పరిశుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రతి నెలా 3వ శనివారం స్వచ్చాంధ్ర ప్రదేశ్, స్వర్ణాంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుచున్నదన్నారు. ఈ నెల లో " ప్లాస్టిక్ కాల్యుషం అంతం " అనే అంశంతో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం సూచించిందని అందుకనుగుణంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదని, ప్రజలు కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేదించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పించన్ 4 వేల రూపాయలకు పెంచి ఇవ్వడం జరుగుచున్నదన్నారు. అలాగే తల్లికి వందనం కార్యక్రమం క్రింద కుటుంబంలో ఎంతమంది పిల్లలు వుంటే అంతమందికి పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే దీపం పథకం కింద అర్హులైన కుటుంబాలకు 3 గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం జరుగుచున్నదన్నారు. పేదరికం లేని సమాజమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని, అందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పి4 కార్యక్రమాన్ని ప్రవేసపెట్టడం జరిగిందన్నారు. పేదలను బంగారు కుటుంబాలుగాను, వారిని అండగా నిలిచే వారిని మార్గదర్శకులుగా గుర్తించి వారిద్దరిని అనుసంధానం చేసే కార్యక్రమం పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా జరుగుచున్నదన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. ఈ రోజు మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐసియు యూనిట్‌ను కూడా మంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. అనంతరం తర్లుపాడు మండలం, సీతానాగులవరం గ్రామంలో 25 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లకు మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డితో కలసి శంఖుస్థాపన చేసారు. ఈ కార్యక్రమాల్లో తర్లుపాడు ఎంపిపీ భూలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి లక్ష్మా నాయక్, ఎస్సి కార్పోరేషన్ ఈడి అర్జున్ నాయక్, నియోజకవర్గ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకండి నిషేధించండి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

**(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, జులై 19)**





వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడానికి ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు పూర్తిగా తగ్గించి నిషేధించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు కోరారు. "స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర" లో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యమునకు అంతం కార్యక్రమం నూజెండ్లలో శనివారం ఎండిఓ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్పు జీవి ఆంజనేయులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయని, వాతావరణ మార్పుకు దోహదం చేస్తాయని, కాబట్టి పర్యావరణాన్ని రక్షించడానికి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పూర్తిగా నిషేధించాలని ప్రజలను ఆయన కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి, నీరు మరియు గాలిని కలుషితం చేస్తాయని, ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వలన గ్రీన్ హౌస్ వాయువులు విడుదలై వాతావరణ మార్పుకు కారణం అవుతాయన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులను వాడకం ప్రజలు మానివేయాలని, బదులుగా జ్యూట్ కవర్లు, గుడ్డ సంచులు పర్యావరణ అనుకూలమైన వాటిని వాడాలని సూచించారు. ప్లాస్టిక్ విస్తరలలో భోజనాలు చేయరాదని, ప్లాస్టిక్ గ్లాసుల్లో టీలు వేడి పదార్థాలు తీసుకోరాదని దాని వలన క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. పర్యావరణానికి, మానవాళికి పెను ప్రమాదమైన ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు వెంటనే నిషేధించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మద్యం కేసులో అసలు తిమింగలానికి త్వరలోనే శిక్ష తప్పదు

### రూ.వేల కోట్లు దోచుకుని ఆఫ్రికా దేశాల్లో పెట్టుబడులు పెట్టారు
### నూజెండ్లలో సుపరిపాలన కార్యక్రమంలో
### ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, జులై 19)**







మద్యం కేసులో ప్రస్తుతం సిట్ విచారణలో భాగంగా జరుగుతున్న అరెస్టులన్నీ చాలా చిన్నచిన్న చేపలవే అని, అసలు తిమింగలాన్ని త్వరలోనే ఆధారాలతో సహా ప్రజల ముందు నిలబెడతామని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. లిక్కర్ మాఫియాతో దోపిడీ చేసిన డబ్బుల్ని ఆఫ్రికా దేశాల్లో మైనింగ్ కార్యకలాపాల్లో పెట్టుబడులు పెట్టారని అవన్నీ నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 35లక్షల మందిని ఆస్పత్రుల పాలు చేసి, 32 వేల మంది ప్రాణాలు తీసి సంపాదించిన డబ్బులతో దుబాయిలో తైతక్కలు, సినిమాలు తీయటం షికార్లు, విలాసాలు చేయడం వారికే చెల్లిందని అన్నింటికీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. శనివారం మండల కేంద్రం నూజండ్లలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. స్థానికంగా పలువురి ఇళ్లకు వెళ్లి ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. అనంతరం మీడియా తో మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పింఛన్లు అమలు చేస్తున్నా మన్నారు. వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, మంచానికి పరి మితమైన వారికి రూ.15 వేలు చొప్పున నెలకు రూ.3 వేల కోట్లు కేటాయిస్తున్నామని, ఇలా ఐదేళ్లలో రూ.1.8 లక్షల కోట్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగానే మద్యం కేసుపై స్పం దించారు చీఫ్‌విప్ జీవీ. మద్యనిషేధం చేస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజల్ని తడిగుడ్డతో ప్రజల గొంతులు కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యపాన నిషేధం చేయకపోగా రానున్న 15ఏళ్ల మద్యం ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు చేశారని మండిపడ్డారు. అవ న్నీ ఒకెత్తయితే ఈ కేసులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మిథున్ రెడ్డి, రాజ్ కెసి రెడ్డి... వీళ్లందరు చాలా చిన్న చేపలన్న ఆయన వాళ్ల వెనక ఉన్న వేలకోట్లు తిన్న భారీ తిమింగలం పని కూడా త్వరలోనే పడతామన్నారు. ఒక్కఛాన్స్ అంటే నమ్మి 151 సీట్లతో గెలిపించిన పాపానికి నాసిరకం, జే-బ్రాండ్ల మద్యంతో రాష్ట్రాన్ని నాశనం చేశారని వాపోయారు. ఆ విషపూరిత మద్యం ధాటికి ఎన్నో అంతుబట్టని అనారోగ్యాలు ప్రజల్ని వేధించాయని, కొందరు ఆ దుష్పరిణామాలు ఇప్పటి కీ అనుభవిస్తున్నారని తెలిపారు. ఆ పాపాలు సరిచేయడంతో పాటు రాష్ట్రంలో శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్న జీవీ మహిళలపై దాడులు, అత్యాచారాలు , గూండాయిజం, రౌడీయిజంపై ఉక్కుపాదం మోపామన్నారు. జగన్ పాలనలో 5ఏళ్ల క్రితం గంజాయి, డ్రగ్స్‌కు కేరాఫ్ అడ్రెస్‌గా ఉన్న రాష్ట్రాన్నే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మత్తువిముక్తిలో ముందు వరసలో నిలుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆగస్ట్ మొదటి వారం నుంచి సాగర్ నీటి విడుదల

### సాగునీటి సలహా మండలి సమావేశంలోసిఫార్సు చేశాం
### పల్నాడు జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 19)**



సాగర్ ఆయకట్టు కింద రైతులు అందరికీ ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మె ల్యే జీవీ ఆంజనేయులు శుభవార్త చెప్పారు. ఆగస్ట్ మొదటి వారం నుంచే నీటి విడుదలకు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, కలెక్టర్, అధికారులు అందరితో కలసి సమీక్షా సమావేశంలో నిర్ణయించి ప్రభుత్వానికి సిఫార్సు చేశామని వెల్లడించారు. నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఈమేరకు సాగు నీటి సలహామండలి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ పి.అరుణ్ బాబు, తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని 4.48 లక్షల మంది రైతుల ప్రయోజనాలను కాపాడేలా సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులు, రైతుల సమస్యలు, ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి విడుదల ప్రణాళిక తదితర అంశాలపై అందరు అభిప్రాయాలు పంచుకున్నారు. ముఖ్యంగా కాల్వల ఆధునికీకరణ, నీటిపారుదల వ్యవస్థలో మెరుగుదల, ఆయకట్టు రైతులకు సకాలంలో నీటిని అందించడం వంటి విషయాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఆయకట్టులో ప్రతి చివరి ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వడమే లక్ష్యంగా, రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీయే పాలన సాగుతోందన్నారు. మరో 10, 15రోజుల్లో సాగర్ నిండే శుభసూచకలు కనిపిస్తున్నాయని, ఇది చాలా మంచివిషయంగా పేర్కొన్నారు. అందుకే ఆగస్ట్ మొదటి వారం నుంచి సాగర్ నీటి విడుదల చేయాలని సంఘం సమావేశంలో సిఫార్సు చేస్తూ.. పల్నాడు జిల్లా తరపున ప్రభుత్వా నికి నివేదిస్తున్నామన్నారు. అయిదేళ్ల వైకాపా ప్రభుత్వంలో కాల్వలు కూడా బాగు చేయలేదన్న జీవీ కనీసం తట్ట మట్టి పూడిక తీయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్, మేజర్ కాల్వలను అలా వదిలేయడం బాధాకరమని. సాగునీటి ప్రాజెక్టులపై వారి నిర్లక్ష్యధోరణికి అది నిదర్శనం అన్నారు. పులిచింతల, గుండ్లకమ్మ డ్యామ్ గేట్లు కొట్టుకునిపోతే కనీసం చీమకుట్టినట్లు లేకపో యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీయే ప్రభుత్వం రాగానే రూ.340కోట్లతో ఎన్నెస్పీ మేజర్, మైనర్ కాల్వలు, గేట్లు మరమ్మతులు, పూడిక, తూటాకు తీత చేపట్టామని, చివరి భూములకు కూడా నీరు అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రైతులకు అండగా ఉండే ప్రభుత్వంతోనే ఇది సాధ్యమవుతోందన్న జీవీ ప్రతి రైతు ఆనందంగా ఉండి, ఆర్థిక ప్రగతి సాధించాలనే లక్ష్యంతోనే పని చేస్తున్నామని తెలిపారు. బర్లీపొగాకు విషయంలో ఒప్పందాలు లేకుండా సాగు వద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. పండ్ల తోటలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# ప్లాస్టిక్ నిర్మూలన పై ఒంగోలులో భారీ ర్యాలీ

ప్రజలను చైతన్య పరచిన ఎమ్మెల్యేలు, అధికారులు
ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, బి ఎన్ విజయ్ కుమార్
ప్లాస్టిక్ నిర్మూలనపై ఒంగోలులో భారీ ర్యాలీ
అగ్రభాగంలో ఉండి ప్రజలను చైతన్య పరచిన
ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, బి.ఎన్, విజయ్ కుమార్,
జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ సీతయ్య





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 19)**

ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని కాకుండా మానవాళికి కూడా ముప్పు తీసుకువస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఒంగోలు నగరంలో ప్లాస్టిక్ నిర్మూలనపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఈ ర్యాలీని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్ విజయ్ కుమార్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, పి డి సి సి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య జెండా ఊపి ప్రారంభించారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుండి ప్రారంభమైన అవగాహన ర్యాలీ ప్రధాన వ్యాపార కూడలి అయిన ట్రంక్ రోడ్డు, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ మీదుగా అద్దంకి బస్టాండ్ లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు సాగింది.

ఈ ర్యాలీ అగ్రభాగాన ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయకుమార్, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య ఉండి ప్రజలకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాల గురించి తెలిసేలా అవగాహన కలిగిస్తూ ముందుకు సాగారు. ముఖ్యంగా ట్రంక్ రోడ్డులోని వ్యాపారులకు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని తెలియచేస్తూ ముందుకు సాగారు. సభాస్థలి అయిన ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఒంగోలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల ప్రదర్శనను దామచర్ల, విజయ్ కుమార్, డాక్టర్ సీతారామయ్య పరిశీలించి వీటి వినియోగం గురించి ప్రజలకు మరింత అవగాహన కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు,టీడీపీ నగర అధ్యక్షులు బందారు మదన్, బొడ్డపాటి వెంకట్, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, పలువురు కార్పొరేటర్లు, మెప్మా ఆర్‌పిలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.





## శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ తల్లి పొంగళ్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 19)**

లింగసముద్రం మండలం పెదపవని గ్రామంలో జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ తల్లి పొంగళ్ళ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు కి పెదపవని గ్రామస్తులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలోఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పూరిమిట్ల గురునాథం, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, పార్టీ నాయకులు గూడూరి కల్పన, షేక్ నాయబ్ రసూల్, వంకాయలపాటి మాల్యాద్రి, పఠాన్ హిదయతుల్లా, బోయిళ్ళ కొండపనాయుడు, అడపా రంగయ్య, మండలంలోని ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను ఆకట్టుకునే విధంగా టీచర్లు పనిచేయాలి

జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి







**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 19)**

అంగన్వాడి కేంద్రాలకు పిల్లలను ఆకట్టుకునే విధంగా టీచర్లు పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని విస్తరణ శిక్షణా కేంద్రంలో అంగన్వాడి టీచర్ల శిక్షణ తరగతులను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా నుండి సోదన శిక్షణా బృందం గౌరవ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బాపట్లలోని అంగన్వాడీ టీచర్లకు 4 బ్యాచ్లవారీగా రెండు రోజులు పాటు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులలో అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పాఠాలను బోధించే క్రమంలో, పిల్లల యొక్క శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే విధంగా పిల్లలను పాఠశాలకు ఆకర్షితులు అయ్యే విధంగా ఆటపాటలతో పిల్లలకు ఏ విధంగా పాఠాలు చెప్పాలో ఈ విషయమై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంగన్వాడీ టీచర్లు కేంద్రాలకు వచ్చే పిల్లలను సొంత బిడ్డల వలె చూడాలని, వారికి మంచి విద్యాబుద్ధులు నేర్పాలని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలని ఆయన టీచర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లీలా మాధవి, సిడిపిఓ లక్ష్మీపార్వతి, అంగన్వాడీ టీచర్లు, సోధన శిక్షణా బృందం తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు వారి ఆరోగ్యం పైనా అధికారులు దృష్టిపెట్టాలి

జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 19)**

హాస్టళ్ళలోని విద్యార్థులకు చదువుతోపాటు వారి ఆరోగ్యం పైనా అధికారులు దృష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా చెప్పారు. శనివారం మార్కాపురంలోని ఎస్సీ బాలికల హాస్టలును ఆమె సందర్శించారు. హాస్టల్ లోని సదుపాయాలను, వంటగదిని పరిశీలించారు. రాత్రి భోజనం కోసం వండుతున్న అన్నం రుచి చూశారు. విద్యార్థినులతో ఏకాంతంగా మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు రూపంలో రాసి కంప్లైంట్ బాక్స్‌లో వేయాలని వారికి చెప్పారు. ఈ దిశగా ఒక ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వ్యక్తిగత శుభ్రత, సరైన ఆహారపు అలవాట్లను చిన్ననాటి నుంచే అలవాటు చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. రక్తహీనత, ఇతర వైద్య పరీక్షలను రెగ్యులరుగా నిర్వహించాలని, ఇందుకు సంబంధించిన రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, జిల్లా మలేరియా నివారణ అధికారి మధుసూదన్‌రావు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త హేమంత్, తహసిల్దార్ చిరంజీవి, ఇతర అధికారులు ఉన్నారు.



# ఖాతాదారులకు సేవలు అందించాలి

సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూలై 19)**

కందుకూరు బ్యాంకు అఫ్ బరోడా 118 వ వార్షికోత్సవము శనివారం జరిగింది. ఈ సందర్భముగా కందుకూరు బ్యాంకు అఫ్ బరోడా బ్రాంచ్ లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ఐఏఎస్ హాజరై బ్యాంకు అఫ్ బరోడా వ్యవస్థాపకులు సాయోజరావు గైక్వెడ్ కు ముందుగా పూల మాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఖాతాధారులను ఉద్దేశించి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి, ధనవంతులకు అవసరమాయ్యేవిధముగా బ్యాంకు సేవలు అందించాలని బ్యాంకు అఫ్ బరోడా విదేశాలలో విస్తరించి సేవలు అందిస్తున్నారని అన్నారు. బ్యాంకు అఫ్ బరోడా సేవలు కందుకూరు పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని కొనియాడారు. బ్యాంకు అఫ్ బరోడా కందుకూరు బ్రాంచ్ మేనేజర్ సుదర్శి. మధుసూధనరావు మాట్లాడుతూ ఇది మా బ్యాంకు కాదు మన అందరి బ్యాంకు అని దీనిని అభివృద్ధి చేసే భాద్యత మన అందరి చేతిలో ఉంది అని బ్యాంకు కు వచ్చే ఖాతాదారులకు నేను మా సిబ్బంది మంచి సర్వీస్ అందిస్తామని ఎల్లప్పుడు కస్టమర్లకు అందుబాటులో ఉండి సేవలును అందిస్తామని తెలియజేసారు.ఈ కార్యక్రమం లో బ్యాంకు సిబ్బంది పి. శ్రీనివాసులు, జయంత్ చేతన్, మౌనిక, కీర్తి దేవన్, సంసాద్ భాషా, సురేష్, బొల్లినేని నాగేశ్వరావు, తానికొండ సింహాద్రి, వెంకట శేసయ్య, మహిళా గ్రూప్ మెంబెర్స్ పాల్గొన్నారు.



# మోదీ పాలనలో పథకాల పై బీజేపీ నాయకుల కరపత్రాల పంపిణీ









(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 19)
నరేంద్ర మోడీ 11 ఏళ్ల సుదీర్ఘ సుపరిపాలన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రజాపయోజన పథకాలను వివరించేందుకు బీజేపీ నాయకులు ప్రజల్లోకి వెళ్లారు. బెల్లంకొండ విజయలక్ష్మి (జిల్లా అధికార ప్రతినిధి), ఎస్ డి ఖాదర్ బాషా (జిల్లా మైనారిటీ కో-కన్వీనర్), పువ్వాడ నారాయణ (మండల అధ్యక్షుడు), దోర్నాల రమణారెడ్డి (పట్టణ అధ్యక్షుడు), యుద్ధం మహేష్ తదితరులు ప్రజల వద్దకు వెళ్లి మోదీ పాలనలో తీసుకొచ్చిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పొదిలి చిన్న బస్టాండ్ ప్రాంతంలో కార్మికులు, కూలీ వర్గాలకు మోదీ ప్రభుత్వం అందించిన వసతులు, సంక్షేమ పథకాలపై క్లుప్తంగా వివరించారు. పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను వారికి అందజేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజాసంక్షేమ దృక్పథం, పారదర్శక పాలన, అభివృద్ధి లక్ష్యాలను ప్రజలకు తెలియజేయడమే తమ లక్ష్యమని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి పేర్కొన్నారు.

# అంకిత భావంతో పనిచేసే న్యాయవాదులు మార్గదర్శకులు

## న్యాయమూర్తి శ్రీనివాసకళ్యాణ్

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జులై 19)




అంకిత భావంతో పనిచేసే న్యాయవాదులు ఇతరులకు ఆదర్శంగా ఉంటారని మాచర్ల కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసకళ్యాణ్ అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ హాల్లో ఇటీవల మృతి చెందిన సీనియర్ న్యాయవాది కె కెనడి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది గట్ల సత్యనారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి శ్రీనివాసకళ్యాణ్ మాట్లాడుత కెనడి అందించిన సేవలు అభినందనీయమన్నారు. బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులగా పని చేసి చనిపోయిన వారి చిత్రపటాలను ఏర్పాటు చేసుకోవటం మంచి సంప్రాదాయమని అన్నారు. వీరిని చూసి నూతనంగా న్యాయవాద వృత్తిలోకి వచ్చిన వారు, వారు చేసిన పనుల్లోని మంచిని గ్రహించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కేళం శ్రీనివాసరావు, జల్లా నాగేశ్వరరావు, రమేష్ బాబు, జూపల్లి శ్రీనివాసరావు, గౌస్ భాష, గాలి సాహెబ్, ఆవుల ఉదయ్ కుమార్ రెడ్డి, గంగుల శ్రీనివాసరావు, కుర్రి సాయిమార్కోండారెడ్డి, కుటుంబ సభ్యులు చరణ్, చైతన్య, కోర్టు సిబ్బంది జగ్గారావు, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరి సంక్షేమ పథకాలు అందిస్తాం

## టిడిపి పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జులై 19)
అర్హులందరికి సంక్షేమ పథకాలను అందించేందుకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు వివరించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి- సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారి సలహాలు తీసుకుంటున్నట్లు దుర్గారావు స్పష్టం చేశారు. టౌన్ పరిధిలో శనివారం 9వ వార్డులో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏడాదికి ఉచితంగా అందిస్తున్న 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ. 4వేల పెన్షన్, అన్నా క్యాంటిన్, తల్లికి వందనం, యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకు మెగా డిఎస్సి తదితర పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని హామీలు అమలవుతాయి ఎమ్మెల్యే ఉగ్ర





(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 19)
కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలు దశల వారీ అమలు అవుతాయని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే కనిగిరి రూపురేఖలు మారాయన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. ఎన్నో ఏళ్ళుగా కనిగిరిలో రైలు కూత వినాలని కలలుగంటున్న కనిగిరి ప్రాంత ప్రజలకు ఈ ఏడాదిలో రైలు వస్తుందన్నారు. మోడల్ స్కూల్‌కు సిసి రోడ్డు నిర్మించడంతో పాటు హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేసి విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కనిగిరి మండలం చిన్న ఇర్లపాడు టీడీపీ సీనియర్ నాయకులు ఎం చెంచిరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సుపరిపాలన కార్యక్రమం నిర్వహించారు. పామూరు పట్టణంలో జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.









నూతన బస్సు ప్రారంభం
కనిగిరి ఆర్టీసి డిపోలో నూతన బస్సులను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి శనివారం ప్రారంభించారు. ప్రయాణీకుల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని, కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులను కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, ఆర్టీసి డిఎం బేగం, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com